# సూర్య ఉదయం

ప్రతి పదం... ప్రజా శ్రేయస్కరం

తెలుగు దిన పత్రిక



విలేకరులు కావలెను

సూర్య ఉదయం తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర పదేశ్ ,తెలంగాణలో అన్ని నియోజకవర్గ, కేంద్రాలలో అసక్తి గల విలేకరులు కావలెను. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడునుపూర్తి వివరాలకు సంప్రదించండి.

ఐడి కార్డు ఉచితం

యం.సునీల్ కుమార్

సూర్య ఉదయం తెలుగు దిన పత్రిక ఎడిటర్

సెల్ : 08512 254632



ఎడిటర్ : యం. సునీల్ కుమార్ సంపుటి : 08 సంచిక : 248 ఆదివారం 30 - 08 - 2026 పేజిలు : 08 వెల రూ. 2 రూ/

Published From Kurnool : Circulated at VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam,Chittoor, Kurnool, Kadapa, Anantapuram, Hyderabad


## బంగాళాఖాతంలో మరో అల్పపీడనం



- తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన
- మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ
- సెప్టెంబర్ 2 వరకు వర్షాల తీవ్రత కొనసాగే అవకాశం ఉందని వెల్లడి
- లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

**అమరావతి :** బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని, దీని ప్రభావంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రాబోయే కొద్దిరోజుల్లో వర్షాలు - మిగతా 2 లో

## ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం
# రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని' అమలు

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- గిరిజనుల ఆరోగ్యం కాపాడే బాధ్యత ప్రభుత్వానిది
- ఏజెన్సీలో సంజీవని కార్యక్రమానికి ముఖ్యమంత్రి శ్రీకారం
- అల్లూరి జిల్లాలో ఆరోగ్య రథాలను ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- గన్నెలలో 10 ఆరోగ్య రథాలను ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- మారుమూల ప్రాంతాల్లో కనెక్టివిటీ కోసం సెల్ టవర్ల ఏర్పాటు
- ప్రతి కుటుంబానికి నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యమన్న సీఎం



**అమరావతి :** ఏజెన్సీ ప్రాంతానికి వస్తే కొత్త శక్తి, ఉత్సాహం వస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అల్లూరు జిల్లా అరకులోయ మండలం గన్నెలలో 10 ఆరోగ్య రథాలను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఏజెన్సీలో సంజీవని కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అరకులోయ మండలం గన్నెలలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం మాట్లాడుతూ అరకు కాఫీకి ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకొచ్చామన్నారు. ఆ రోజుల్లోనే ఆయుర్వేద వైద్యం గిరిజనులకు అందించిన వ్యక్తి అల్లూరి సీతారామరాజు అని గుర్తు చేశారు. ఆయన సేవలకు గుర్తుగా భోగాపురం ఎయిర్‌పోర్టుకు ఆయన పేరు పెట్టామని స్పష్టం చేశారు.ఏజెన్సీలో సంజీవని కార్యక్రమానికి శ్రీకారం: "సంజీవని" యాప్ ఓ గేమ్ ఛేంజర్ అని సీఎం చంద్రబాబు అన్నారు. మీకు అనారోగ్యం వస్తే విశాఖ, పాడేరు వెళ్లాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు మీ ఆరోగ్యం మీ ఫోన్‌లో ఉందని, ఎక్కడికి వెళ్లినా మీ ఆరోగ్యం ఫోన్‌లో చెక్ చేసుకోవచ్చని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్‌ను క్రోడీకరించి ఆరోగ్యాన్ని రక్షిస్తామన్నారు. ప్రతి ఒక్క గిరిజన బిడ్డకు మెరుగైన ఆరోగ్యం ఇవ్వాలని సంకల్పించామన్నారు. గిరిజనుల ఆరోగ్యం కాపాడే బాధ్యత ప్రభుత్వానిదన్నారు. ఏజెన్సీ ఏరియాలో - మిగతా 2 లో



## రెండు రోజుల్లో నేనే గుంటూరు వస్తా

- అంబటి రాంబాబు
- ఎవరూ హైదరాబాద్ రావద్దు,
- వైసీపీ నేత అంబటి రాంబాబుకు విజయవంతంగా స్టెంట్ల చికిత్స
- ప్రస్తుతం తన ఆరోగ్యం నిలకడగా ఉందని వెల్లడి
- హైదరాబాద్ రావద్దని, రెండు రోజుల్లో గుంటూరు వస్తానని కార్యకర్తలకు సూచన

**అమరావతి :** వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు తన ఆరోగ్య పరిస్థితిపై స్వయంగా స్పందించారు. సాధారణ ఆరోగ్య పరీక్షల్లో భాగంగా తన గుండెలో రెండు బ్లాకులు గుర్తించారని, వైద్యుల బృందం విజయవంతంగా స్టెంట్లు వేసి చికిత్స పూర్తి చేసిందని ఆయన - మిగతా 2 లో

# హిమాలయాల్లో 'మంచు' ముప్పు

- భారత్‌లో 195 హైరిస్క్ సరస్సులు- బద్దలైతే జలప్రళయమే!
- హిమాలయాల్లో 7,500 హిమానీనద సరస్సులు
- భారత్‌లో 195 సరస్సులు అత్యంత ప్రమాదకరంగా గుర్తింపు
- సిక్కింలోనే 25 హైరిస్క్ సరస్సులు
- గంగా పరివాహక ప్రాంతంలో 4,700 సరస్సులు

**ఢిల్లీ :** నేపాల్‌లో ఇటీవల సంభవించిన హిమానీనద విపత్తు భారత్‌కు మరోసారి హెచ్చరికలు జారీ చేసింది. హిమాలయ పర్వతాల్లోని మంచు సరస్సులు బద్దలైతే ఎంతటి విధ్వంసం సంభవిస్తుందో నేపాల్ ఘటన స్పష్టం చేస్తోంది. అదే సమయంలో భారత్‌లో కూడా వందల సంఖ్యలో ప్రమాదకర హిమానీనద సరస్సులు ఉన్నట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. దీంతో వాటిపై నిరంతర నిఘా, ముందస్తు హెచ్చరిక - మిగతా 2 లో



## దేశవ్యాప్తంగా నేడు నీట్ పీజీ-2026 పరీక్ష



- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన కేంద్రం
- దేశవ్యాప్తంగా రేపు నీట్-పీజీ 2026 పరీక్ష నిర్వహణ
- 2.73 లక్షల మందికి పైగా హాజరుకానున్న వైద్య గ్రాడ్యుయేట్లు
- పటిష్ఠ భద్రత, పారదర్శకతకు పెద్దపీట వేసిన కేంద్ర ప్రభుత్వం
- ప్రశ్నపత్రం లీక్ వదంతులు పూర్తిగా అవాస్తవమన్న కేంద్ర మంత్రి జేపీ నడ్డా
- ఈ ఏడాది పలు విద్యార్థి-స్నేహపూర్వక సంస్కరణల అమలు

**ఢిల్లీ :** దేశవ్యాప్తంగా వైద్య విద్యలో పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) సీట్ల భర్తీకి నిర్వహించే జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్-పీజీ 2026)కు సర్వం సిద్ధమైంది. ఆదివారం (ఆగస్టు 30) దేశంలోని 340 నగరాల్లో 1,300 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించనున్నారు. ఈ ఏడాది రికార్డు స్థాయిలో 2.73 లక్షల మందికి పైగా వైద్య గ్రాడ్యుయేట్లు - మిగతా 2 లో

## నేపాల్‌కు చైనా మరోసారి హెచ్చరిక

- ఏ క్షణంలోనైనా బద్దలవ్వొచ్చు..
- నేపాల్-టిబెట్ సరిహద్దులో కృత్రిమంగా ఏర్పడిన సరస్సుపై చైనా హెచ్చరిక
- హిమనీనదం కూలడంతో ఏర్పడిన సహజ ఆనకట్టతో మరో ప్రమాద ఘంటికలు
- సరస్సు నీటిమట్టం తగ్గడంతో తాత్కాలికంగా తగ్గిన తక్షణ ముప్పు
- డ్రోన్లు, శాటిలైట్లతో పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్న అధికారులు



**ఢిల్లీ :** నేపాల్-టిబెట్ సరిహద్దులో హిమనీనదం కూలిపోవడంతో ఏర్పడిన కృత్రిమ సరస్సు (బ్యారియర్ లేక్) ఏ క్షణంలోనైనా బద్దలయ్యే ప్రమాదం ఉందని చైనా అధికారులు నేపాల్‌ను మరోసారి హెచ్చరించారు. ఈ సరస్సు గట్టు తెగితే భారీగా వరద నీరు దిగువ ప్రాంతాలకు ప్రవహించే అవకాశం ఉందని అప్రమత్తం చేశారు. అయితే, తాజా అంచనాల ప్రకారం తక్షణ ముప్పు కాస్త తగ్గిందని, పరిస్థితి కొంత అదుపులోకి వచ్చిందని కూడా వారు వెల్లడించారు. - మిగతా 2 లో

## యానాం రేవులో రూ. 31,500 పులస సందడి

- యానాం వేలంలో రెండు చేపలకు రికార్డు ధర
- మొత్తం రూ. 31,500కు వేలంలో రికార్డు ధర పులసలను దక్కించుకున్న మహిళ
- ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది తగ్గిన పులస లభ్యత
- అరుదుగా దొరకడంతో ఆకాశాన్నంటుతున్న ధరలు







## తెలంగాణలో సెప్టెంబర్ 8, 9 తేదీల్లో ప్రత్యేక టెట్



- ఇన్-సర్వీస్ టీచర్లకు టెట్ షెడ్యూల్ విడుదల
- సెప్టెంబర్ 8, 9 తేదీల్లో ఆన్‌లైన్ పరీక్షలు
- మొత్తం 24,983 మంది అభ్యర్థులు హాజరు
- రోజుకు మూడు షిఫ్టుల్లో పరీక్షల నిర్వహణ

**హైదరాబాద్ :** తెలంగాణలో ఇన్-సర్వీస్ ఉపాధ్యాయుల కోసం నిర్వహించే ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) షెడ్యూల్‌ను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. 2026 విద్యా సంవత్సరానికి గాను సెప్టెంబర్ 8, 9 తేదీల్లో ఈ పరీక్షలను ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నట్లు ప్రకటించింది.ఈ ప్రత్యేక టెట్ కోసం రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 24,983 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. పరీక్షలను ప్రతిరోజూ - మిగతా 2 లో

## సర్‌పై అభ్యంతరాలు, క్లెయిమ్‌ల
# గడువు పొడిగించండి

- ఓటర్ల తొలగింపుపై సీఈసీకి సీఎం రేవంత్ రెడ్డి లేఖ
- గడువు 4 వారాలు పొడిగించాలని విజ్ఞప్తి
- తెలంగాణలో 92.86 లక్షల ఓట్లు పోయాయన్న రేవంత్ రెడ్డి
- అర్హులైన వారు ఓటు కోల్పోకుండా సమగ్ర పరిశీలన జరపాలని విన్నపం
- ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు భద్రతను కల్పించాలన్న సీఎం
- కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్‌కు సీఎం రేవంత్ రెడ్డి లేఖ
- ఎస్ఐఆర్‌కు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని తెలిపిన సీఎం
- ఓటర్ల పరిశీలనలో అనేక లోపాలు ఉన్నాయని ఆరోపణ



**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో ఎస్ఐఆర్ గడువు పొడిగించాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. అభ్యంతరాలు, క్లెయిమ్‌లకు మరో నాలుగు వారాలు సమయం ఇవ్వడంతో పాటు తుది ఓటర్ల జాబితా ప్రచురణ తేదీ సవరించాలని సీఈసీ జ్ఞానేష్ కుమార్‌కు సీఎం లేఖ రాశారు. ఓటర్లకు అవసరమైన సహాయం అందించేందుకు పట్టణ ప్రాంతాల్లో హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. కనీసం రెండు సార్లు గ్రామ, వార్డు సభలు నిర్వహించి ముసాయిదా ఓటరు జాబితాను చదివి వినిపించాలన్నారు. అర్హత ఉన్న ఒక్క ఓటు కూడా పోవద్దన్న సీఎం రాష్ట్ర ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం ఇచ్చేందుకు సిద్ధమని తెలిపారు.ఎస్ఐఆర్ ప్రక్రియ కారణంగా అర్హత ఉన్న ఒక్క ఓటరు పేరు తొలగిపోకూడదని, అలాగే అనర్హులైన ఓటరు ఎవరూ జాబితాలో చేరకూడదని రేవంత్ రెడ్డి కేంద్ర ఎన్నికల కమిషన్‌ను కోరారు. అభ్యంతరాలు, ఫిర్యాదులు సమర్పించే గడువు పొడిగించడంతో పాటు ఓటర్లకు తగిన సమయం, అవసరమైన సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలని సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు సీఎం లేఖ రాశారు. రాష్ట్రంలో 3 కోట్ల 38లక్షల - మిగతా 2 లో

# సంపాదకీయం

## ప్రళయ నేపాలం

మాటలకు అందని మహావిషాదం ఇది. హిమాలయ దేశం నేపాల్‌లో సంభవించిన వరదలు వందలాది కుటుంబాలను బలితీసుకున్నాయి. మృతుల సంఖ్య మూడువందలు దాటడంతోపాటు, వేలాదిమంది ఆచూకీ తెలియరాలేదు. నేపాల్ వరదల ఉగ్రరూపం, విధ్వంసం హిమాలయాల అతిసున్నితమైన, అస్థిర పర్యావరణానికి ప్రబల నిదర్శనం. వాతావరణ మార్పు తీవ్రంగా ప్రభావితం చేస్తున్న తరుణంలో, కంటికి కనిపించే ఆ అందమైన మంచుపర్వతాల వెనుక జరుగుతున్నదేమిటో తెలుసుకోలేకపోతే ఇటువంటి అనేక విపత్తులు చూడవలసి వస్తుందని ఈ పరిణామాలు హెచ్చరిస్తున్నాయి.మాధ్యమాల్లో విస్తృతంగా కనిపిస్తున్న ఆ దృశ్యాలు భయానకంగా ఉన్నాయి. వరద, బురద కలగలసి అతివేగంగా దిగువకు జారి వందలాదిగ్రామాలను నామరూపాలు లేకుండా చేశాయి. నేపాల్---చైనా సరిహద్దుకు టిబెట్ వైపున ఉన్న పర్వత సమూహం నుంచి ఒక భారీ కొండచరియ విరిగిపడి, లెండే---భోటే కోసి---త్రిశూలి నదీ వ్యవస్థ గుండా అమితవేగంతో ప్రవహించడంతో వేలాదిమంది గల్లంతయ్యారు, ఆరు జలవిద్యుత్ కేంద్రాలు ధ్వంసమయ్యాయి, నేపాల్---చైనా సరిహద్దు ద్వారం కొట్టుకుపోయింది. ఉగ్రరూపం దాల్చిన నదులు గట్లను తెంచుకుంటూ, భవనాలను, రోడ్లను, ఇళ్ళనూ ముంచెత్తుతూ, దారిలో ఉన్న ప్రతీదానినీ కబళిస్తూ, ప్రాణభయంతో పరుగులు తీస్తున్నవారిని సైతం తమలో కలిపేసుకున్న ఆ దృశ్యాలు మనలను ఎంతోకాలం వెంటాడుతాయి. అధ్యయనాలు, విశ్లేషణలు మరింత లోతుగా, నిర్దిష్టంగా సాగి, ఈ విధ్వంసానికి మూలకారణం తేలడానికి అనేక నెలలు పట్టవచ్చు. ఈ జలప్రళయానికి మంచుకొండల్లో సంభవించిన భూకంపమా, హిమనీ సరస్సు విస్ఫోటనమా తేలాల్సి ఉంది.కనీసం ఏడున్నర నిముషాల ముందు 4.4 తీవ్రతతో సంభవించిన ప్రకంపనలే ఈ గొలుసుకట్టు పరిణామాలను సృష్టించాయని కొందరు అంటారు. కొండచరియలు విరిగిపడిన ప్రకంపనలే ఆ స్థాయిలో ఉన్నాయని మరోవాదన. ఏది నిజమైనప్పటికీ, అక్కడ 5.2 తీవ్రత గల భూకంపడం నమోదుకావడం ఈ విషాదం తీవ్రతకు రుజువు. నేపాల్--టిబెట్ సరిహద్దులోని భోటేకోషి నదీప్రవాహం మొదలయ్యే దగ్గర కొత్తగా మరో సరస్సు ఏర్పడిందని, రెండు మూడురోజుల్లో అది తెగిపోవచ్చునని నేపాల్‌కు ఇప్పుడు మరో ప్రమాదహెచ్చరిక వినబడుతోంది. ఇప్పటికే పొంగిపొర్లుతున్న టిబెట్‌లోని రెండునదుల సంగమస్థలం అతివేగంగా ముప్పైలక్షల క్యూబిక్ మీటర్ల నీటిని నింపుకొని నేపాల్‌ను ముంచెత్తవచ్చునన్నది ఆ హెచ్చరిక సారాంశం. కొద్దినిముషాల్లోనే ఆరు జలవిద్యుత్ ప్రాజెక్టులు, విద్యుత్ లైన్లు, సబ్‌స్టేషన్లు కొట్టుకుపోవడం, నేపాల్ సగర్వంగా చాటుకుంటున్న 25మెగావాట్ల సోలార్ ప్రాజెక్టు బురదలో కూరుకుపోవడం వంటి విషాదాలు గమనించినప్పుడు ప్రకృతితో సమన్వయం లేకుండా సాధించే అభివృద్ధిని నిలబెట్టుకోవడం కష్టమని అర్థమవుతుంది. ఏడాది క్రితం జెన్‌జీ తిరుగుబాటుతో అధికారంలోకి వచ్చిన ఆర్నెల్లలోనే నేపాల్ ప్రధాని బాలెన్ షా సమర్థతకు ఈ జలప్రళయం అతి పెద్దపరీక్ష పెట్టింది. నేపాలీల్లో ఆయనపట్ల నమ్మకం సడలిపోతోందని విశ్లేషణలు వెలుగుచూస్తున్న నేపథ్యంలో, ఈ సంక్షోభసమయంలో ఆయన తన సమర్థతను రుజువుచేసుకోవాల్సి ఉంది. వాతావరణ మార్పులతో ముడిపడిన ఈ తరహా విపత్తులు భవిష్యత్తులో ఎదుర్కోవడానికి నేపాల్‌కు ఒక సమర్థవంతమైన వ్యూహాన్ని సిద్ధం చేయాల్సిన బాధ్యత కూడా ఆయనమీద ఉంది.ఉత్తరాఖండ్ నుండి సిక్కిం, అరుణాచల్‌ప్రదేశ్ వరకు, భారతదేశం సైతం హిమాలయ ప్రమాదాలను ఎదుర్కొంటోంది. వేగంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో, పర్యాటక వ్యామోహంలో అడ్డూ అదుపు లేకుండా సాగుతున్న నిర్మాణాలతో కొండచరియలు అస్థిరంగా మారి ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. పైన ఆ మంచుపర్వతాల్లో జరుగుతున్నదేమిటో తెలుసుకోకుండా రహదారులు, జలవిద్యుత్ ప్రాజెక్టులు, సొరంగాల వంటి నిర్మాణాలు సాగిపోతున్నాయి. హిమాలయ సానువుల్లో సంభవించే ప్రతి విషాదం మరో భారీ ప్రమాదానికి సంకేతమే. సరిహద్దు వివాదాలకు పరిమితమవుతున్న ప్రభుత్వాలకు ఈ మెరుపు వరదలు ఒక హెచ్చరిక. సరిహద్దులు దాటిన ఇలాంటి విషాదాల విషయంలో దేశాల మధ్య సహకారం అత్యవశ్యకం. పూర్తిసమన్వయంతో, అత్యాధునిక సాంకేతికతల సాయంతో నిరంతరం కచ్చితమైన సమాచారాన్ని సేకరిస్తూ అందరూ పంచుకోవాల్సిన అవసరం ఉంది. ప్రకృతి బీభత్సాలను నివారించలేకపోయినా, ప్రమాదహెచ్చరికలతో వేలాదిప్రాణాలు కాపాడుకోవచ్చు.

## రెండు రోజుల్లో నేనే గుంటూరు వస్తా

**మొదటిపేజీ తరువాయి -** తెలిపారు. తనను పరామర్శించేందుకు ఎవరూ హైదరాబాద్ రావద్దని, రెండు రోజుల్లో తానే గుంటూరుకు తిరిగి వస్తానని, అక్కడే అందరం కలుసుకుందామని పార్టీ శ్రేణులకు, అభిమానులకు విజ్ఞప్తి చేశారు.వివరాల్లోకి వెళితే, శుక్రవారం అంబటి రాంబాబు స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు ఆయన్ను మెరుగైన వైద్యం కోసం హుటాహుటిన హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆయనకు అవసరమైన అన్ని పరీక్షలు నిర్వహించారు. యాంజియోగ్రామ్ చేసిన అనంతరం, గుండె రక్తనాళాల్లో రెండు బ్లాకులు ఉన్నట్లు నిర్ధారించి, స్టెంట్లు వేయాలని నిర్ణయించారు. ఈ ప్రక్రియను వైద్య బృందం విజయవంతంగా పూర్తి చేసింది.ప్రస్తుతం అంబటి రాంబాబు ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆయన వైద్యుల ప్రత్యేక పర్యవేక్షణలో ఉన్నారని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. ఆందోళన చెందాల్సిన అవసరం ఏమీ లేదని స్పష్టం చేశాయి. ఈ వార్త తెలియడంతో తొలుత వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ఆయన అభిమానులు ఆందోళనకు గురయ్యారు. అయితే, చికిత్స విజయవంతం కావడం, ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని తెలియడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

**మొదటిపేజీ తరువాయి -** మళ్లీ పుంజుకునే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. బంగాళాఖాతంలో వేగంగా మారుతున్న ఈ వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రజలు, ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల వాసులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తరాంధ్ర జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడే అవకాశం ఉందని తెలిపారు. ఈ వర్షాల తీవ్రత సెప్టెంబర్ 2 వరకు కొనసాగే అవకాశం ఉందని, ఉత్తరాంధ్రతో పాటు రాయలసీమలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేశారు. ఇక తెలంగాణలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని, రాజధాని హైదరాబాద్‌లో రానున్న 24 గంటల్లో ఆకాశం దట్టంగా మేఘావృతమై అప్పుడప్పుడు వాన చినుకులు పడే అవకాశం ఉందన్నారు.వర్షాలు, ఈదురుగాలుల సమయంలో ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదని... చెట్లు, భారీ విద్యుత్ స్తంభాలు, పాత భవనాల కింద నిలబడ వద్దని హెచ్చరించారు. వర్షం కురుస్తున్న సమయాల్లో వాహనదారులు ప్రయాణాల్లో వేగాన్ని తగ్గించి జాగరూకతతో వాహనాలు నడపాలని విపత్తు నిర్వహణ శాఖ కోరింది.

## తెలంగాణలో సెప్టెంబర్ 8, 9 తేదీల్లో ప్రత్యేక టెట్

**మొదటిపేజీ తరువాయి -** మూడు షిఫ్టుల్లో నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఉదయం 9:00 గంటల నుంచి 11:30 వరకు, మధ్యాహ్నం 2:00 గంటల నుంచి 4:30 వరకు వివిధ సెషన్లలో పరీక్షలు జరుగుతాయి. సెప్టెంబర్ 8న పేపర్-1, పేపర్-2 (తెలుగు, ఇంగ్లీష్ మీడియం) పరీక్షలు నిర్వహిస్తారు. సెప్టెంబర్ 9వ తేదీన మిగిలిన మాధ్యమాలకు సంబంధించిన పేపర్-2 పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు.ప్రభుత్వ, సంబంధిత పాఠశాలల్లో పనిచేస్తూ, ఇప్పటికీ నిర్దేశిత అర్హత ప్రమాణాలను సాధించని ఉపాధ్యాయుల కోసమే ఈ ప్రత్యేక టెట్‌ను నిర్వహిస్తున్నారు. హాల్ టికెట్లు, ఇతర పూర్తి వివరాల కోసం అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ ంఎష్ట్రశీశీశ్రీవసఙ్‌.వశ్రీఖఅ-స్త్రుఖఙు.స్త్రశీజ.ఱఅ సందర్శించాలని విద్యాశాఖ సూచించింది.

## 22ఏ భూముల సమస్యలపై పోరుబాట



**మొదటిపేజీ తరువాయి -** దీక్ష నిర్వహించిన బీజేపీ నాయకత్వం... తాజాగా రాష్ట్ర ప్రభుత్వ విధివిధానాలకు వ్యతిరేకంగా మరో రెండు ప్రధాన పోరాటాలకు సన్నద్ధమవుతోంది.ఈ క్రమంలో నిషేధిత 22ఏ జాబితాలో చేర్చిన భూముల వ్యవహారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి బాధితులకు అండగా నిలిచేందుకు వచ్చే నెల (సెప్టెంబర్) 5, 6 తేదీల్లో బీజేపీ నేతలు భారీ దీక్ష చేపడుతున్నారు. ఈ దీక్షా కార్యక్రమాన్ని విజయవంతం చేయడంపై చర్చించేందుకు ఈరోజు నిర్వహించిన సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు నేతృత్వంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొని భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు.మరోవైపు, ఫసల్ బీమా పథకాన్ని రాష్ట్రంలో తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ లోని అసెంబ్లీ వరకు పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్ 'రైతు యాత్ర' చేపడుతున్నారు. తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు రాబోయే రోజుల్లో ఆందోళనలను మరింత తీవ్రతరం చేయనున్నట్లు బీజేపీ ప్రకటించింది.

## ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం , రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని' అమలు

**మొదటిపేజీ తరువాయి -** మరికొన్ని సెల్ టవర్లు పెట్టించి కనెక్టివిటీ పెంచుతామన్నారు. 3 నెలల్లో అల్లూరి జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు.గిరిజనులకు 50 ఏళ్లకే పింఛన్లు: "ఏ వైద్య పరీక్ష అయినా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిపేలా ఏర్పాట్లు చేస్తాం. సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేసిన ఘనత ఈ ప్రభుత్వానిదే. గిరిజనులకు 50 ఏళ్లకే పింఛన్లు ఇస్తున్నాం. దీంతో నేను సంతృప్తి చెందడం లేదు. గిరిజన ప్రాంతంలో ఉన్న ఉద్యోగాలన్నీ గిరిజనులకే దక్కాలనేది ఈ ప్రభుత్వ విధానం. అందరికీ ఆమోదయోగ్యమైన జీవోను మళ్లీ తీసుకువస్తామని హామీ ఇస్తున్నా. వీలైనంత త్వరగా అన్ని గ్రామాలకు రోడ్లు వేసేలా చర్యలు తీసుకుంటాం. అరకు కాఫీకి ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చాం. ఏజెన్సీ ప్రజలకు ఆదాయం అరకు కాఫీ, మిరియాల నుంచి వస్తోంది" అని సీఎం తెలిపారు.పారదర్శకంగా 16 వేలమందికి పోస్టులిచ్చాం: ఒక్క రూపాయి కూడా అవినీతి జరగకుండా డీఎస్సీ నిర్వహించామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పారదర్శకంగా 16 వేలమందికి టీచర్ పోస్టులిస్తే ఏడాది తర్వాత గొడ్డలి పార్టీ రాద్ధాంతం చేస్తోందని ధ్వజమెత్తారు. వైఎస్సార్సీపీ హయాంలో ఏపీపీఎస్సీలో అక్రమాలకు పాల్పడి, నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.మరోవైపు గన్నెల పంచాయతీ ఆర్.కె.నగర్‌లో ప్రజలతో సీఎం చంద్రబాబు ముఖాముఖి నిర్వహించారు. ప్రభుత్వం నుంచి అందుతున్న సేవలు, ఇతర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. గర్భిణీతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ గ్రామంలో 47 ఇళ్లు, 189 మంది జనాభా ఉండగా, ఇక్కడ పాపులేషన్ మేనేజ్‌మెంట్ బాగుందని, అందుకు గల విధానాలను అడిగి తెలుసుకున్నారు.ఓ మహిళ తన కుమార్తె నీట్ శిక్షణలో ఉందని తెలుపగా శెభాష్ అన్న ముఖ్యమంత్రి. అందరూ ఇదే స్ఫూర్తితో పిల్లలని చదివించాలన్నారు. మహిళలతో మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తు కోసం ఏం చేస్తున్నారు ఏం చేయబోతున్నారు అని ప్రశ్నించారు. ఆర్.కె.(రామకృష్ణ) నగర్ లో మొత్తం 16 మందితో సీఎం మాట్లాడారు. వారందరీ యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలు మీ వరకు చేరుతున్నాయా అని ఆరా తీశారు. చంద్రబాబు రాకను పురస్కరించుకొని ఆర్.కె.నగర్ మహిళలు, చిన్నారులు థింసా నృత్యంతో స్వాగతం పలికారు.

## హిమాలయాల్లో 'మంచు' ముప్పు



**మొదటిపేజీ తరువాయి -** వ్యవస్థలు ఎంతవరకు సిద్ధంగా ఉన్నాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ప్రభుత్వ సర్వే ప్రకారం, భారత హిమాలయ ప్రాంతంలో దాదాపు 7,500 హిమానీనద సరస్సులు ఉన్నాయి. వీటిలో సుమారు 10 శాతం కంటే దాదాపు 750 సరస్సులు సిక్కింలోనే ఉన్నట్లు అంచనా. వీటిలో 25 సరస్సులను అత్యంత ప్రమాదకరమైనవిగా గుర్తించారు. హిమాలయ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు పెరగడం, మంచు కరుగుదల, వర్షపాతంలో మార్పులు వంటి పరిణామాలు ఆ సరస్సులపై ప్రభావం చూపుతున్నాయి. హిమానీనదాల నుంచి కరిగిన మంచు, నీరు చేరి ఏర్పడే సరస్సులు కాలక్రమంగా భారీగా విస్తరించే అవకాశం ఉంటుంది. సరస్సులను చుట్టుముట్టిన మంచు, రాళ్ల గోడలు బలహీనపడితే ఒక్కసారిగా నీరు బయటకు రావచ్చు. దీనినే గ్లేషియల్ లేక్ ఔట్‌బర్స్ట్‌ఫ్లడ్(+శ్రీూఖీ) అంటారు. ఇలాంటి వరదలకు భారీ నీటితోపాటు మట్టి, రాళ్లు, మంచు కూడా కలవడంతో దిగువ ప్రాంతాల్లో విధ్వంసం మరింత పెరుగుతుంది. అయితే భారత్‌లో హిమానీనద సరస్సుల ముప్పు సిక్కింకే పరిమితం కాదు. గంగా నదీ పరివాహక ప్రాంతంలోనే సుమారు 4700 సరస్సులు ఉన్నట్లు అంచనాలు వెలువడుతు న్నాయి.ఆ నదీ పరివాహక ప్రాంతం 2.5 లక్షల చదరపు కిలోమీటర్లకుపైగా విస్తరించి ఉంది. వీటిలో ఏదైనా అత్యంత ప్రమాదకర సరస్సు ఒక్కసారిగా బద్దలైతే దిగువ ప్రాంతాల్లోని గ్రామాలు, పట్టణాలు, రహదారులు, వంతెనలు, విద్యుత్ ప్రాజెక్టులు, ఇతర కీలక మౌలిక సదుపా యాలకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ముఖ్యంగా పర్వత ప్రాంతాల్లో లోయలు ఇరుకుగా ఉండటంతో వరద ప్రవాహం మరింత వేగంగా కిందకి దూసుకెళ్లే ప్రమాదం ఉంటుంది.సౌత్ లొనాక్ ఘటన తర్వాత కేంద్ర హిమానీనద సరస్సులపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. వివిధ కేంద్ర, రాష్ట్ర సంస్థల మధ్య సమన్వయం కోసం ఉన్నతస్థాయి సమన్వయ కమిటీని ఏర్పాటు చేసింది. ప్రధానమంత్రి కార్యాలయానికి చెందిన ఉన్నతాధికారి పీకే మిశ్రా నేతృత్వంలో కమిటీ పనిచేస్తోంది. ప్రమాదకర సరస్సులను గుర్తించడం, వాటిపై సర్వేలు నిర్వహించడం, పర్యవేక్షణ వ్యవస్థలను బలోపేతం చేయడం వంటి అంశాలపై కమిటీ దృష్టి పెట్టింది. అంతే కాదు, ప్రమాదం ఎక్కువగా ఉన్న నాలుగు హిమాలయ రాష్ట్రాల్లో కార్యక్రమాల కోసం కేంద్రం రూ.150 కోట్లను కేటాయించింది.

## దేశవ్యాప్తంగా నేడు నీట్ పీజీ-2026 పరీక్ష

**మొదటిపేజీ తరువాయి -** ఈ పరీక్షకు హాజరుకానున్నారు. పరీక్ష నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి, అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.ఈ పరీక్ష ద్వారానే దేశంలోని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలల్లో ఎండీ (డాక్టర్ ఆఫ్ మెడిసిన్), ఎంఎస్ (మాస్టర్ ఆఫ్ సర్జరీ) వంటి ఉన్నత వైద్య కోర్సులలో ప్రవేశాలు కల్పిస్తారు. గతేడాదితో పోలిస్తే ఈసారి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సంఖ్య 12.5 శాతం పెరిగినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (చీదీజుమీ) ఆగస్టు 26న అడ్మిట్ కార్డులను విడుదల చేసింది. పరీక్ష మొత్తం ఒకే షిఫ్టులో జరగనుంది.పరీక్షల నిర్వహణలో పారదర్శకత, భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు కేంద్ర మంత్రి జేపీ నడ్డా స్పష్టం చేశారు. ఎన్‌బీఈఎంఎస్, టెక్నాలజీ భాగస్వాములు, ఇతర ఏజెన్సీల సంసిద్ధతను ఆయన సమీక్షించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా, అత్యంత పకడ్బందీగా పరీక్షను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అభ్యర్థులకు స్నేహపూర్వక వాతావరణం కల్పించాలని సూచించారు.ప్రశ్నపత్రం లీక్ అయిందంటూ సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను, మోసపూరిత ప్రచారాలను అభ్యర్థులు నమ్మవద్దని నడ్డా విజ్ఞప్తి చేశారు. "పరీక్ష ప్రారంభానికి కొద్ది సమయం ముందు మాత్రమే అత్యంత సురక్షితమైన, ఎన్‌క్రిప్టెడ్ విధానంలో తుది ప్రశ్నపత్రాన్ని ఎంపిక చేస్తారు. దీనికి బహుళ అంచెల సాంకేతిక, కార్యాచరణ భద్రతా ఏర్పాట్లు ఉంటాయి. కాబట్టి, ఎవరైనా ప్రశ్నపత్రం ముందుగానే తమకు లభించిందని చెబితే అది పూర్తిగా అవాస్తవం, అభ్యర్థులను తప్పుదోవ పట్టించే ప్రయత్నమే" అని ఆయన తేల్చి చెప్పారు. అనుమానాస్పద కార్యకలాపాలను వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, కేవలం ఎన్‌బీఈఎంఎస్, ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికారిక ప్రకటనలను మాత్రమే విశ్వసించాలని సూచించారు. పరీక్షల సమగ్రతను కాపాడేందుకు ఈసారి పటిష్ఠమైన భద్రతా ఫ్రేమ్‌వర్క్‌ను అమలు చేస్తున్నారు. దేశవ్యాప్తంగా సీసీటీవీ నిఘా, బయోమెట్రిక్ వెరిఫికేషన్, సిగ్నల్ జ్యామర్లు, డైనమిక్ కంప్యూటర్ కేటాయింపు వంటి చర్యలు చేపట్టారు. పరీక్షల పర్యవేక్షణకు సెంట్రల్, రీజనల్ కమాండ్ సెంటర్ల ద్వారా లైవ్ మానిటరింగ్ చేయనున్నారు. ఇందుకోసం 60,000 మందికి పైగా సిబ్బందిని నియమించారు.ఈ ఏడాది విద్యార్థుల సౌలభ్యం కోసం పలు సంస్కరణలు ప్రవేశపెట్టారు. అభ్యర్థులు తమ సొంత రాష్ట్రంతో పాటు మరో రెండు రాష్ట్రాలను పరీక్షా కేంద్రాల కోసం ఎంచుకునే వెసులుబాటు కల్పించారు. పరీక్ష జరిగే నగరం సమాచారాన్ని మూడు వారాల ముందే తెలియజేయడంతో, ప్రయాణ ఏర్పాట్లకు విద్యార్థులకు తగినంత సమయం లభించింది. పరీక్షా విధానంలో కూడా మార్పులు చేశారు. 210 నిమిషాల్లో 180 ప్రశ్నలకు సమాధానమిచ్చేలా సమయాన్ని పెంచారు. రిజిస్ట్రేషన్, పరీక్ష సమయంలో ఆధార్ ఆధారిత గుర్తింపును తప్పనిసరి చేశారు. వేలిముద్రలు సరిపోలని సందర్భాల్లో ఐరిస్ ఆధారిత బయోమెట్రిక్ వెరిఫికేషన్‌ను ప్రత్యామ్నాయంగా వినియోగించనున్నారు.

## సర్‌పై అభ్యంతరాలు, క్లెయిమ్‌ల గడువు పొడిగించండి


**మొదటిపేజీ తరువాయి -** ఓటర్లు ఉండగా అందులో 73 లక్షల 39వేలు మృతి, డూప్లికేట్, ఆబ్‌సెంట్, ఇతర ప్రాంతాలకు షిఫ్టయిన ఏఎస్?డీడీ కేటగిరీలో పెట్టారని సీఈసీకి రాసిన లేఖలో సీఎం వివరించారు. అన్‌మ్యాపింగ్, అనామలిస్ కేటగిరీల్లో మరో 92 లక్షల 86 వేల మందికి నోటీసులు ఇస్తున్నారన్నారు. సుమారు మూడో వంతు ఓటర్లు నిరూపించుకోవడం లేదా ఓటు కోల్పోయే పరిస్థితి ఉందన్నారు.ఏఎస్‌డీడీ కేటగిరీలో సుమారు 62 శాతం అంటే 45 లక్షల 19 వేల మంది శాశ్వతంగా షిఫ్ట్ అయిన కేటగిరీలో పెట్టారన్న సీఎం ఓటర్ల పరిశీలన విధానంలో పలు లోపాలున్నాయన్నారు. తాత్కాలికంగా బయటకు వెళ్లిన వారు శాశ్వతంగా షిఫ్టెడ్‌కు తేడా చూపలేదన్నారు. బీఎల్ఓలు వెళ్లిన సమయంలో ఏదైనా పనిపై తాత్కాలికంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారిని కూడా శాశ్వతంగా షిఫ్టెడ్?గా పెట్టారన్నారు. నిజంగా శాశ్వతంగా అడ్రస్ మారిన వారు కొత్త ప్రాంతాల్లో ఓటు నమోదు చేసుకునేలా సహకరించకుండా అప్పటి వరకున్న చోట ఓటు తొలగించారని సీఎం వివరించారు. నివాసం మారిన వారికి నోటీసు ఇవ్వకుండానే తొలగించారన్నారు. దీనివల్ల ఓటర్లు పోలింగ్ రోజున కేంద్రానికి వెళ్లే వరకు తమ ఓటు పోయిందన్న విషయం తెలుసుకోలేని పరిస్థితి ఏర్పడుతుందని, ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని సీఎం పేర్కొన్నారు. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాల్లోనే రాష్ట్రంలోని మొత్తం ఏఎస్‌డీడీ ఓటర్లలో 58.6 శాతం, పరిశీలన నోటీసుల్లో 41.9 శాతం ఉన్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. ఉద్యోగాలు, వివాహాలు, తాత్కాలిక నివాస మార్పుల కారణంగా పట్టణ ప్రాంతాల్లో అనేక మంది ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉన్నందున సవరణ ప్రక్రియను మరింత సులభతరం చేయాల్సిన అవసరం ఉందన్నారు.తెలంగాణ రాష్ట్రంలో సమీప భవిష్యత్తులో ఎలాంటి ఎన్నికలు లేనందున ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను సమగ్రంగా నిర్వహించేందుకు తగిన సమయం ఉందని ముఖ్యమంత్రి లేఖలో తెలిపారు. ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు ఉన్న అభ్యంతరాలు, ఫిర్యాదుల గడువును మరో నాలుగు వారాలు పొడిగించడంతో అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా ప్రచురణ తేదీని సవరించాలని రేవంత్‌రెడ్డి కోరారు. పల్లెలు, పట్టణాల్లో విస్తృత ప్రచారం చేయాలన్న రేవంత్‌రెడ్డి కనీసం రెండుసార్లు గ్రామసభలు, వార్డు కమిటీ సమావేశాలు ఏర్పాటు చేసి ముసాయిదా ఓటర్ల జాబితాలను బహిరంగంగా చదివి వినిపించాలని ముఖ్యమంత్రి కోరారు.కూలీలు, వలస కార్మికులు, వయోవృద్ధులు డాక్యుమెంట్లను సమర్పించేందుకు వారం సమయం సరిపోదని, కనీసం మూడు నుంచి నాలుగు వారాల సమయం ఇవ్వాలని ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్రంలో ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో నియోజకవర్గ, పోలింగ్ కేంద్రం స్థాయిలో హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేసి, ఓటర్లకు అవసరమైన పత్రాలపై అవగాహన కల్పించడంతో పాటు వాటిని పొందేందుకు సహకరించాలని సూచించారు. ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్‌ను అంగీకరించకపోవడం వల్ల పట్టణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్న సీఎం మండల స్థాయిలో సులభంగా లభించే ఇతర పత్రాలను కూడా ఆమోదించేలా ఆధారాల జాబితాను సవరించి విస్తరించాలని సూచిం చారు.హైదరాబాద్‌లో నియోజకవర్గానికి 78 వేలకుపైగా నోటీసులు అందుకుంటున్న వారు ఉన్నందున కొద్దిమంది ఈఆర్‌వోలు సరిపోరన్నారు. అదనపు ఈఆర్‌వోలను కూడా నియమిండంతో పాటు నోటీసు ల్లోనే విచారణ తేదీ, సమయాలను పేర్కొంటూ క్షేత్రస్థాయిలో విచారణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అర్హత ఉన్న ప్రతీ ఓటరుకు న్యాయం జరిగేలా కేంద్ర ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కోరారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను సజా వుగా, పారదర్శకంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున హెల్ప్‌డెస్క్‌ల ఏర్పాటు, గ్రామసభల నిర్వహణతో పాటు ఇతర అవసరమైన సహకారాన్ని పూర్తిస్థాయిలో అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆ లేఖలో స్పష్టం చేశారు.

## నేపాల్‌కు చైనా మరోసారి హెచ్చరిక



**మొదటిపేజీ తరువాయి -** బుధవారం అత్యంత ఎత్తులో ఉన్న ఒక హిమనీనదం విస్ఫోటనం చెందడంతో ఈ ప్రళయం సంభవించింది. ఈ దుర్ఘటనలో భారీగా రాళ్లు, మంచు, బురద కొట్టుకువచ్చి నదీ ప్రవాహానికి అడ్డుకట్ట వేయడంతో ఈ సహజ ఆనకట్ట ఏర్పడింది. దీనివల్ల గైరాంగ్ సరిహద్దు క్రాసింగ్, భోటే కోశి, త్రిశూలి నదీ వ్యవస్థల పరిధిలోని ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో నేపాల్ విదేశాంగ శాఖకు చైనా అధికారులు ఒక సందేశం పంపారు. సరస్సులోని నీటి రంగు క్రమంగా ముదురు రంగులోకి మారుతోందని, ఇది ఆనకట్ట ఏ క్షణంలోనైనా బద్దలవడానికి సంకేతం కావచ్చని పేర్కొన్నారు. శుక్రవారం నాటికి సరస్సులో సుమారు 2.5 మిలియన్ క్యూబిక్ మీటర్ల నీరు చేరిందని అంచనా వేశారు. ఒకవేళ ఆనకట్ట పాక్షికంగా బద్దలైతే, సెకనుకు 500 క్యూబిక్ మీటర్ల వేగంతో ప్రవాహం ఉండవచ్చని, ఇది నది గట్లకే పరిమితం అవుతుందని తెలిపారు.అయితే, ఆ తర్వాత చైనా అధికారులు మరో తాజా సమాచారం అందించారు. సరస్సు ఉపరితల వైశాల్యం తగ్గిందని, దీంతో వరద ముప్పు కాస్త తగ్గిందని వారు స్పష్టం చేశారు. ఈ అంచనాతో తాత్కాలికంగా నిలిపివేసిన సహాయక చర్యలను పునఃప్రారంభించారు. అధికారులు డ్రోన్లు, శాటిలైట్ల సహాయంతో పరిస్థితిని నిరంతరం గమనిస్తున్నారు. దీనికి ఎగువన మరో పెద్ద నీటి వనరును కూడా గుర్తించి, దాని కదలికలను కూడా పర్యవేక్షిస్తున్నారు.ఈ విపత్తు కారణంగా సరిహద్దుకు ఇరువైపులా వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. వెయ్యి మందికి పైగా గల్లంతయ్యారు. మృతుల్లో చాలా మంది విదేశీయులు కూడా ఉన్నారు. ప్రతికూల వాతావరణం, మళ్లీ వరదలు రావచ్చన్న ఆందోళనల మధ్య సహాయక చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి.

## యానాం రేవులో రూ. 31,500 పులస సందడి



**మొదటిపేజీ తరువాయి -** గోదావరి జిల్లాల్లో పులస చేపల సీజన్ మొదలైంది. తాజాగా మత్స్యకారుల వలకు చిక్కిన రెండు పులస చేపలు వేలంలో రికార్డు ధర పలికాయి. యానాం రేవులో జరిగిన వేలంపాటలో ఈ రెండు చేపలను కలిపి ఓ మహిళ ఏకంగా రూ. 31,500కు కొనుగోలు చేశారు.వివరాల్లోకి వెళితే.. మత్స్యకారులకు 1.300 కేజీల బరువున్న రెండు పులస చేపలు చిక్కాయి. వీటికి నిర్వహించిన వేలంలో మత్స్యకార మహిళ పార్వతి పాల్గొన్నారు. ఒక చేపను రూ. 24,000కు, మరొకటి రూ. 7,500కు, మొత్తం రూ. 31,500కు ఆమె దక్కించుకున్నారు. ఈ ఏడాది మగ పులసకు ఇంత భారీ ధర పలకడం ఇదే తొలిసారని స్థానిక మత్స్యకారులు చెబుతున్నారు. నెల రోజుల క్రితం దొరికిన 1.250 కేజీల పులస రూ. 14,000 పలికింది.ఈ ఏడాది వాతావరణ మార్పుల కారణంగా పులసల లభ్యత గణనీయంగా తగ్గింది. ఎల్‌నినో ప్రభావంతో గోదావరికి వరదలు ఆలస్యం కావడమే ఇందుకు ప్రధాన కారణం. సాధారణంగా జులై, ఆగస్టు నెలల్లో గోదావరికి ఎర్ర నీరు వచ్చినప్పుడు పులసల రాక మొదలవుతుంది. కానీ, ఈసారి వరదలు ఆలస్యం కావడంతో చేపలు చాలా తక్కువగా వలకు చిక్కుతున్నాయి. దీంతో వీటికి డిమాండ్ పెరిగి, వేలంలో ధరలు ఆకాశాన్నంటున్నాయి.సముద్రంలో ఉండే ఇలస చేప, గుడ్లు పెట్టేందుకు గోదావరి ప్రవాహానికి ఎదురీదుతుంది. ఈ క్రమంలోనే అది పులసగా మారుతుంది. దీని రుచి అద్భుతంగా ఉండటంతో తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా ప్రజలు పులస కోసం గోదావరి జిల్లాలకు వస్తుంటారు. అరుదుగా దొరకడం, అమోఘమైన రుచి కారణంగానే దీనికి ఇంతటి డిమాండ్ ఏర్పడింది.

# మాధవరం కృష్ణారావు స్థాయిని మించి విమర్శలు చేస్తే సహించం

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చౌకబారు వ్యాఖ్యలు**

**మానుకోవాలి బండి రమేష్**



**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్‌పల్లి :** పదేళ్ల పాటు శాసనసభ్యుడిగా కొనసాగిన కృష్ణారావు కూకట్‌పల్లి నియోజకవర్గ అభివృద్ధికి చేసిందేమీ లేకపోగా, తన స్థాయిని మించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చౌకబారు విమర్శలు చేస్తున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ముఖ్యమంత్రిపై విమర్శలు చేసే సమయంలో నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని ఆయన కృష్ణారావును హెచ్చరించారు. శనివారం కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బ్లాక్, డివిజన్ అధ్యక్షులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో బండి రమేష్ మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించడంతో పాటు గత టీఆర్ఎస్ పాలనపై తీవ్ర విమర్శలు చేశారు. కృష్ణారావు హయాంలో కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని చెరువులు, నాలాలు, కుంటలు పెద్ద ఎత్తున కబ్జాలకు గురయ్యాయని బండి రమేష్ ఆరోపించారు. హస్మత్‌పేట సర్వే నంబర్ 1లోని 100 ఎకరాల్లో కేవలం 10 ఎకరాలు మాత్రమే మిగిల్చారని, అల్లాపూర్‌లో నాలుగు ఎకరాల్లో రెండు ఎకరాలు, గోపాల్‌నగర్‌లో 10 ఎకరాల ఖాళీ స్థలాన్ని కబ్జా చేసి కృష్ణారావు, ఆయన అనుచరులు సొమ్ము చేసుకున్నారని విమర్శించారు. పీజేఆర్ హయాం నుంచి నేటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వాల పాలనలో జరిగిన అభివృద్ధి, టీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని బండి రమేష్ సవాల్ విసిరారు. మొదటిసారి కౌన్సిలర్‌గా పోటీ చేసిన సమయంలో కృష్ణారావు ఆస్తులు ఎంత ఉన్నాయని, ప్రస్తుతం ఆయన ఆస్తుల విలువ ఎంత ఉందో ప్రజలకు వివరించాలని ప్రశ్నించారు. 'ఉరి, హత్య, ఆత్మహత్య' వంటి అంశాలను ప్రస్తావిస్తూ ప్రజల సానుభూతి పొందేందుకు కృష్ణారావు నాటకాలు ఆడుతున్నారని బండి రమేష్ విమర్శించారు. ఆయనను చంపాల్సిన అవసరం తమకు లేదని అన్నారు. రాజకీయ విమర్శలు హద్దులు దాటకుండా ఉండాలని సూచించారు. హౌసింగ్ బోర్డు స్థలాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమ్ముకుంటోందంటూ కృష్ణారావు చేసిన విమర్శలపై కూడా బండి రమేష్ తీవ్రంగా స్పందించారు. టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వేల ఎకరాల ప్రభుత్వ భూములను విచ్చలవిడిగా విక్రయించారని ఆరోపించారు. అప్పట్లో జరిగిన వ్యవహారాలు కృష్ణారావుకు కనిపించలేదా అని ప్రశ్నించాద్గరు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని తెలంగాణ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతోందని బండి రమేష్ అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, గ్యాస్, రేషన్ కార్డులు, పెట్రోల్ బంకులు, బస్సులు, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు వంటి పథకాలను ప్రభుత్వం చేపట్టిందని వివరించారు. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, బ్రిడ్జిలు, లింక్ రోడ్లు, స్కైవాక్ వంతెనల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రూ.10 లక్షల బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం 70 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించిందని, విద్యా రంగంలో నూతన విధానాలకు శ్రీకారం చుట్టిందని బండి రమేష్ పేర్కొన్నారు. రానున్న ప్రతి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగురవేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

# తెలుగు భాషా వికాసానికి సాంకేతికత తోడవ్వాలి

**భాషా వ్యాప్తికి తెలుగు యూనివర్సిటీ కృషి అభినందనీయం**

**మండలి వెంకట కృష్ణారావు సంస్కృతి పురస్కారానికి టీవీ శ్రీనివాస్ అర్హులు**

**పురస్కార ప్రదానోత్సవంలో త్రిపుర గవర్నర్ ఎన్. ఇంద్రసేనా రెడ్డి**

**సూర్య ఉదయం ప్రతినిధి హైదరాబాద్ ఆగస్టు 29 :** తెలుగు భాషా వికాసానికి సాంకేతికత తోడవ్వాలని, అలాగే స్వచ్ఛమైన తెలుగును కాపాడుకోవడం మనందరి బాధ్యత అని త్రిపుర గవర్నర్ ఎన్. ఇంద్రసేనా రెడ్డి సూచించారు. నాంపల్లిలోని ఆడిటోరియంలో సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం నిర్వహించిన మండలి వెంకట కృష్ణారావు సంస్కృతి పురస్కార ప్రదానోత్సవంలో ఆయన మాట్లాడారు. ఆంధ్ర అసోసియేషన్, పూణె సలహాదారు టి.వి. శ్రీనివాస్ కు పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ తొలుత అందరికీ తెలుగు భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మండలి వెంకట కృష్ణారావు తనకు అసెంబ్లీలో పరిచయమని, ఎవరి గురించైనా ఎదుటి వాళ్లు చెప్పినప్పుడు చాలా గొప్పగా ఉంటుందని, అటువంటి వంటి వ్యక్తి వెంకట కృష్ణారావు అన్నారు.

**వర్సిటీ ప్రత్యేక కార్యక్రమాలు అభినందనీయం**

తెలుగు యూనివర్సిటీ, తెలుగు భాష విషయంలో వర్సిటీ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకరమన్నారు. కేవలం భాష మాత్రమే కాకుండా, సంస్కృతీ సంప్రదాయాలు, నృత్యాలు, డప్పుల కార్యక్రమాలతో మిగతా వర్సిటీల కన్నా ప్రత్యేకత చాటుతోందని కొనియాడారు. గతంలో ఉన్న గవర్నర్ నార్త్ ఈస్ట్ లో ఉన్న కల్చరల్ అసోసియేషన్లను తీసుకొచ్చి ఇక్కడ వాటి ఎదుగుదలకు కృషి చేశారని గుర్తు చేశారు. మిగతా దేశాలు, రాష్ట్రాలు, ప్రాంతాల్లో కూడా తెలుగు భాష వ్యాప్తికి కృషి వర్సిటీ కృషి అభినందనీయమని తెలిపారు. అలాగే టి.వి. శ్రీనివాస్ కు ఈ పురస్కారం అందజేయడం సంతోషంగా ఉందన్నారు. అయితే సాంకేతికత వినియోగంలో తెలుగు యూనివర్సిటీ ఇంకా సాధించాల్సిన అవసరం ఉందని ఇంద్రసేనా రెడ్డి సూచించారు. తరగతి బోధన బట్టీపట్టే పద్ధతిలో కాకుండా, అనుభవ పూర్వకంగా ఉండాలన్నారు. ఆ దిశగా వర్సిటీ ఆలోచించాలని అన్నారు.

**ఇంగ్లీష్ పదాలు లేని తెలుగుపై పోటీలు**


శ్రీనివాస్ మాటల్లో సిగ్గు, బిడియం వంటి పదాలు ఉన్నాయని, వాస్తవానికి అవన్నీతనకు వర్తిస్తాయని చమత్కరించారు. వారంతా స్పష్టంగా తాను తెలుగులో మాట్లాడలేనని అన్నారు. మొత్తంగా ఆయన ప్రసంగంలో కేవలం 3 పదాలు మాత్రమే ఇంగ్లిషువి ఉన్నాయన్నారు. అది నిజంగా గొప్ప విషయమన్నారు. ఆ రకంగా మాట్లాడాలని పోటీలు కూడా పెట్టాలని సూచించారు. వేరే భాషా పదాలు రాకుండా కొన్ని నిమిషాలు మాట్లాడాలని పోటీలు పెట్టడం వల్ల చాలా లాభం ఉంటుందని పేర్కొన్నారు. ఇంత స్వచ్ఛంగా తెలుగు భాష మాట్లాడతారు కాబట్టే శ్రీనివాస్ ఈ పురస్కారానికి అర్హులు అన్నారు. తనకు భాష మీద ప్రత్యేక అభిమానం ఉన్నప్పటికీ, సబ్జెక్ట్ దగ్గరకు వచ్చేసరికి మిగతా పదాలన్నీ వస్తాయని అన్నారు.

**తెలుగుకు తగ్గిన ప్రాముఖ్యత**

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భాష సంయుక్త రాష్ట్రాలు ఏర్పడితే, అందరూ ఒక్కటిగా ఉంటారని ఆలోచన ఉండేదని, కానీ కొన్ని భాషలను ఆయా రాష్ట్రాలు బలవంతంగా కిల్ చేశాయని తెలిపారు. ఉదాహరణకు ఇక్కడి నుంచి సూరత్, బొంబాయి, పుణా వెళ్లిన వాళు అక్కడ తెలుగు పాఠశాలలు పెట్టుకున్నారని, అలాగే బయట నుంచి వచ్చిన వాళ్లు ఇక్కడ ఆయా భాషల పాఠశాలలు పెట్టుకున్నారని తెలిపారు. ఈరోజు అక్కడున్న స్కూళలో తప్పనిసరిగా లోకల్ భాష నేర్చుకోవాలన్నా ఆంక్షలతో తెలుగుకు ప్రాముఖ్యత తగ్గిందన్నారు. ఒకప్పుడు మా భాష ఉండాలి, మా భాష సంస్కృతి ఉండాలనే ఆలోచన ఉండేదని, ఇప్పుడు అటువంటి ఆలోచన లేదన్నారు.

**ప్రాజెక్టు ఆధారిత అభ్యాసం అవసరం**

విద్యార్థులకు ప్రాజెక్టు ఆధారిత అభ్యాసం, కేస్ స్టడీస్, ఇండస్ట్రీ




ఇంటర్న్‌షిప్, నూతన విద్యాబోధనలు వంటి నూతన పోకడలను తెలుగు వర్సిటీ అనుకరించాలని సూచించారు. విద్య అంటే సాధారణ డిగ్రీలా కాకుండా, అనుభవ పూర్వకంగా ఉండాలనే ఉద్దేశంతో మోదీ ప్రభుత్వం నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీని తీసుకొచ్చిందన్నారు. డిజిటల్ విద్య అవసరం అని గుర్తించాలన్నారు. అయితే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చెబితే అది 100 శాతం కరెక్ట్ అనే ఆలోచన తప్పు అన్నారు. కొన్ని సార్లు సంతకం రాని వారికి కూడా డాక్టరేట్ ఇస్తామని, అది ఆయనకు ఉన్న ప్రత్యేకమైన క్వాలిటీకి లభించిన గుర్తింపు అన్నారు. మోదీ ప్రభుత్వం వచ్చాక పద్మశ్రీ వంటి బిరుదుల కేటాయింపులో కూడా ప్రత్యేక గుర్తింపు ఉన్న వారికి ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు.పురస్కార గ్రహీత శ్రీనివాస్ మాట్లాడుతూ నేటి తరానికి, రాబోయే తరానికి తెలుగు భాషా సంస్కృతులను, వాటి మహోన్నత వైభవాన్ని పరిచయం చేస్తున్న సురవరం తెలుగు విశ్వవిద్యాలయానికి అభినందనలు తెలిపారు. తనను పురస్కారానికి ఎంపిక చేసినందుకు అభివాదాలు అన్నారు. తనను తెలుగు మాధ్యమంలోనే చదివించిన తల్లిదండ్రులకు, నాన్నమ్మ రుణం తీర్చుకోలేనన్నారు. తమ ఇంట్లో ఎప్పుడూ చక్కటి తెలుగు వాతావరణం ఉండేదని చెప్పుకొచ్చారు.ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా వర్సిటీ వీసీ ఆచార్య వెలుదండ నిత్యానంద రావు వ్యవహరించారు.ముఖ్య అతిథులుగా ఏపీ శాసనసభ్యులు డా. మండలి బుద్ధప్రసాద్, తెలంగాణ ప్రభుత్వం పూర్వ సలహాదారులు డా. కె.వి. రమణాచారి పాల్గొన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంత రావు స్వాగతోపాన్యాసం చేశారు. డైరెక్టర్ ఆచార్య బి. హెచ్. పద్మప్రియ కార్యక్రమాన్ని నిర్వహించారు.

# గ్రీన్‌హిల్స్ రహదారిపై 'జెడ్' మలుపులు.. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

**కూకట్‌పల్లి ప్రధాన మార్గంలో నిత్యం వాహన రద్దీ**

**ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పునరుద్ధరించాలని స్థానికుల విజ్ఞప్తి**

**సాయంత్రం వేళ ట్రాఫిక్ నియంత్రణకు నలుగురు కానిస్టేబుళ్ల విధులు**

**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్‌పల్లి :** కూకట్‌పల్లిలోని ప్రధాన రహదారుల్లో గ్రీన్‌హిల్స్ రహదారి ఒకటి. హైటెక్ సిటీ పరిసర ప్రాంతాల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు, ఔటర్ రింగ్‌రోడ్డు, విమానాశ్రయం, షాపింగ్ ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు ఈ మార్గాన్ని విస్తృతంగా వినియోగిస్తుంటారు. దీంతో ఈ రహదారిపై నిత్యం భారీగా వాహనాల రాకపోకలు కొనసాగుతుంటాయి. గ్రీన్‌హిల్స్ రహదారిపై ప్రధానంగా రెండు ప్రాంతాల్లో 'జెడ్' ఆకారపు మలుపులు ఉండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఒక ప్రాంతం కైతలాపూర్ వంతెన మీదుగా గ్రీన్‌హిల్స్ రహదారికి చేరుకునే మార్గం కాగా, మరో ప్రాంతం రంగధాముని చెరువు వైపు నుంచి గ్రీన్‌హిల్స్ రహదారికి వచ్చే మార్గం. ఈ రెండు ప్రాంతాల్లో రహదారి వెడల్పు తక్కువగా ఉండటంతో పాటు, ఒక మలుపు తిరిగిన వెంటనే మరో మలుపు తీసుకోవాల్సి వస్తోంది. దీంతో ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో వందలాది వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభిస్తోంది.

**పక్కనే సిగ్నల్స్.. అయినా సాఫీగా సాగుతున్న ట్రాఫిక్**




అదే రహదారిపై అల్లాపూర్ చౌరస్తా, అయ్యప్ప సొసైటీ చౌరస్తా, కాకతీయ హిల్స్ చౌరస్తా ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ అమల్లో ఉంది. ఈ ప్రాంతాలు ఒకదానికొకటి సమీపంలో ఉన్నప్పటికీ, సిగ్నల్ వ్యవస్థ కారణంగా వాహనాల రాకపోకలు సాపేక్షంగా సాఫీగా సాగుతున్నాయి. అదే విధంగా గ్రీన్‌హిల్స్ రహదారిలో 'జెడ్' మలుపులు ఉన్న రెండు ప్రాంతాల్లో కూడా ఇప్పటికే ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పునరుద్ధరించి వినియోగంలోకి తీసుకువస్తే ట్రాఫిక్ సమస్యకు కొంతమేర పరిష్కారం లభించే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**సిగ్నల్స్ పనిచేస్తే పోలీసులపై భారం తగ్గే అవకాశం**

ప్రస్తుతం గ్రీన్‌హిల్స్ మార్గంలో సాయంత్రం వేళ ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు నలుగురు పోలీస్ కానిస్టేబుళ్లు విధులు నిర్వహించాల్సి వస్తోంది. ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను పునరుద్ధరిస్తే వాహనాల కదలికలను క్రమబద్ధీకరించడంతో పాటు, ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులపై ఉన్న భారం కూడా తగ్గే అవకాశం ఉంది.

**అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి: బండి. మధుసూదనరెడ్డి**

గ్రీన్‌హిల్స్ రహదారిపై నెలకొన్న ట్రాఫిక్ సమస్యను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని రెయిన్బో విస్టాస్ రాక్ గార్డెన్ బండి. మధుసూదనరెడ్డి కోరారు. ముఖ్యంగా కైతలాపూర్ వంతెన వైపు నుంచి వచ్చే ప్రాంతం, రంగధాముని చెరువు వైపు నుంచి వచ్చే ప్రాంతాల్లో ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్ వ్యవస్థను పునరుద్ధరించి, 'జెడ్' ఆకారపు మలుపుల కారణంగా ఏర్పడుతున్న ట్రాఫిక్ ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణించే ఈ కీలక రహదారిపై ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి వాహనదారులకు 'జెడ్' మలుపుల ఇబ్బందుల నుంచి విముక్తి కల్పించాలని కోరారు.

# రెయిన్బో విస్టాస్ ఎస్టీపీపై ఎమ్మెల్యే పరిశీలన

**స్థానికుల అనుమానాలు, అసౌకర్యాలపై అధికారులతో చర్చ**

**పది రోజుల్లో సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశం**

**22ఏ నుంచి కాలనీలను తొలగించడంపై ఎమ్మెల్యేకు నివాసితుల కృతజ్ఞతలు**



**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్‌పల్లి :** ప్రభుత్వం నూతనంగా నిర్మించిన 43 ఎంఎల్‌డీ సామర్థ్యం గల రెయిన్బో విస్టాస్ ఎస్టీపీ (సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)ను కూకట్‌పల్లిలోని రెయిన్బో విస్టాస్ రాక్ గార్డెన్ , మెరీనా స్కై, సేవాలాల్ నగర్ నివాసితుల ఫిర్యాదుల నేపథ్యంలో స్థానిక శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు పరిశీలించారు. పరిశీలినాలో భాగంగా ఎస్టీపీకి సంబంధించి స్థానికుల్లో ఉన్న అనుమానాలు, ఆందోళనలు, అసౌకర్యాలపై ఎమ్మెల్యే కృష్ణారావు అధికారులతో అక్కడికక్కడే చర్చించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్థానికులు వ్యక్తం చేసిన అనుమానాలు, సమస్యలను రానున్న పది రోజుల్లో పరిష్కరించి, ఎస్టీపీ కారణంగా పరిసర ప్రాంతాల ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులకు ఎమ్మెల్యే స్పష్టమైన సూచనలు చేశారు.

**ఎమ్మెల్యే కు ప్రత్యేక ధన్యవాదాలు**

ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తక్షణమే స్పందించి, సమస్య ఉన్న ప్రాంతానికి స్వయంగా వచ్చి అధికారులతో మాట్లాడటంపై స్థానిక నివాసితులు హర్షం వ్యక్తం చేశారు. తమ సమస్యలను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే చొరవ చూపడంపై వారు కృతజ్ఞతలు తెలిపారు. ఇదిలా ఉండగా, గత కొంతకాలంగా కూకట్‌పల్లి పరిధిలోని సుమారు 5 వేల నివాస సముదాయాలకు సంబంధించిన కాలనీలను 22ఏ జాబితాలో చేర్చడం వల్ల నివాసితులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పలు ప్రజా వేదికలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించడంతో పాటు, అధికారులతో కూడా పలుమార్లు చర్చించారు. ఎమ్మెల్యే చేసిన కృషి ఫలితంగా ఇటీవల 22ఏ నుంచి ఆయా ప్రాంతాలను తొలగించడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బండి మధుసూదన్ రెడ్డి, సత్యనారాయణరెడ్డి, జయంత్, సాంబిరెడ్డి, శ్రీనివాసరావు, వెంకట్‌రెడ్డి, సత్యనారాయణ యాదవ్, సతీష్, బొల్లంరెడ్డి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# భాష్యం పాఠశాలలో ఘనంగా నేషనల్ స్పోర్ట్స్ డే, తెలుగు భాషా దినోత్సవం





**సూర్య ఉదయం ఎమ్మిగనూరు :** భాష్యం విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణ వైస్ చైర్మన్ హనుమంతరావు సార్ జెడ్ ఈవో శ్రీమతి కవిత ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించడం జరిగింది.ఇందులో భాగంగా విద్యార్థిని విద్యార్థులకు, కోకో, కబడ్డీ, త్రో బాల్, నిర్వహిఒచారు. విద్యార్థిని విద్యార్థులు కూడా క్రీడల్లో అత్యుత్సాహం ప్రదర్శించారు. జెడ్ఈఓ శ్రీమతి కవిత మాట్లాడుతూ చదువుతో పాటు పిల్లలు శారీరకంగా, మానసికంగా ఎదుగుదల కోసము క్రీడలు కూడా అత్యంత ప్రముఖ్యమైనవి అని తెలియజేశారు భాష్యం యాజమాన్యం ఇటువంటి క్రీడలను నిర్వహించడంలో, భాష్యం సమస్త ముందుగా ఉంటుంది. భాష్యం ప్రీమియర్ లీగ్ పోటీలను నిర్వహిస్తున్నారని తెలియజేశారు.అదేవిధంగా తెలుగు భాష దినోత్సవం గురించి మాట్లాడుతూ, అమ్మ ఒడిలో నేర్చుకునే భాష మాతృభాష అని ఎన్ని భాషలు నేర్చుకున్న మాతృభాషను మరువకూడదని మాతృభాష మమకారాన్ని చాటారు, తెలుగు భాష దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థిని విద్యార్థులకు పద్యాల పోటీలను మరియు క్విజ్ పోటీలను నిర్వహించడం జరిగింది. గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు జెడ్ఈఓ కవిత మేడం మరియు ప్రిన్సిపల్ నాగరాజ్ సార్ గారు జెడ్ సి ఓ అనురాధ మేడం చేతులమీదుగా బహుమతులను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగు భాష ఉపాధ్యాయులను మరియు క్రీడా ఉపాధ్యాయులను సన్మానించడం జరిగింది ఇందులో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# ఖోఖో పోటీలలో జంపాపురం విద్యార్థులు ప్రతిభ...

**రాష్ట్రస్థాయిఅమరావతి ఛాంపియన్ షిప్ క్రీడాకారులుగా జంపాపురం విద్యార్థులు**



**ఆగస్టు 29 (సూర్య ఉదయం ప్రతినిధి మంత్రాలయం) :** ఈనెల 24నుండి 27వరకు తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి అమరావతి ఛాంపియన్ షిప్ ఖోఖో పోటీలలో కర్నూలు జిల్లా తరుపున కోసిగి మండలం జంపాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెందిన ఖ/17 విభాగం బాలుర యందు ఖ.రఘు అలాగే ఖ/17 బాలికల విభాగం యందు భారతి,జ అనూష, దీ.ఊర్మిల ప్రాతినిధ్యం వహించారు. జిల్లా జట్టు తరుపున ఆడిన రాష్ట్రస్థాయి క్రీడాకారులను కోసిగి వీజూా-2 శ్రీనివాసులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహులు ఫీల్డ్ తో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులు రామచంద్ర మాట్లాడుతూ,విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని గుర్తించి మరింతగా రాటుదేలి,జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా క్రీడాకారులను తయారు చేయడమే తమ కర్తవ్యం అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మహబూబ్ బాషా, పెద్దారెడ్డి,మహేంద్ర,వెంకటేష్ బాబు, శ్రీలత తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గూడూరులో ఘనంగా శ్రీ సంతాన నాగమ్మ ప్రభోత్సవం







**సూర్య ఉదయం గూడూరు :** గూడూరు పట్టణంలోని పడమర బీసీ కాలనీలో కొలువైన శ్రీ సంతాన నాగమ్మ ప్రభోత్సవం కార్యక్రమాన్ని శనివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. శ్రావణ మాసాన్ని పరిష్కరించుకొని భక్తులు ప్రతి సంవత్సరం అమ్మవారి ప్రభోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహిస్తూ వస్తున్నారు. శ్రావణ మాసాన్ని పురస్కరిం చుకొని శనివారం శ్రీ సంతాన నాగమ్మ దేవాలయం నుంచి ఉత్సవ ప్రభ రథంపై అమ్మవారి విగ్రహాన్ని కొలువుంచి మేళ తాళాలతో ఆశేష భక్తుల సమక్షంలో ఊరేగింపుగా కర్నూలు రోడ్డులోని ఆర్ కానాపురం రోడ్డుకు పక్కన ఉన్న దేవత భావి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మరల తిరుగు ప్రభ రథం ద్వారా శ్రీ సంతాన నాగమ్మ గుడికి రాథాన్ని తీసుకొని వచ్చి దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రభోత్సవ కార్యక్రమానికి వచ్చిన భక్తులకు దేవాలయం తరపున దాతల సహకారంతో ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ నిర్వహించింది.

# కోసిగి కొండపై తిమ్మప్ప స్వామికి పవిత్ర తుంగభద్ర జలాభిషేకం





**కోసిగి, ఆగస్టు 29 (సూర్య ఉదయం ప్రతినిధి మంత్రాలయం) :** కోసిగి మండలం కడేపాలెం గ్రామానికి చెందిన యువకులు శనివారం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో శ్రీ తిమ్మప్ప ఆంజనేయ స్వామికి పవిత్ర తుంగభద్ర జలాలతో ఘనంగా అభిషేకం నిర్వహించారు. శుక్రవారం రాత్రి కొండపై భక్తిశ్రద్ధలతో సప్త భజన కార్యక్రమాన్ని నిర్వహించారు.శనివారం వేకువజామునే యువకులు పాదయాత్రగా తుంగభద్ర నదికి చేరుకుని, పవిత్ర జలాలను బిందెలలో సేకరించారు. కొండ కింద నుండి భారీ పూలమాలలు, డప్పు వాయిద్యాల మధ్య పాదయాత్రగా కొండపై వెలసిన ఆలయానికి చేరుకుని స్వామివారికి పవిత్ర జలాలతో అభిషేకం చేశారు.: కోసిగి ప్రాంతంతో పాటు రాయలసీమ, కర్నూలు పశ్చిమ ప్రాంతాల్లో సమృద్ధిగా వర్షాలు కురిసి, పాడిపంటలతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని స్వామివారిని వేడుకున్నారు.కొండపైనే ప్రసాదాన్ని తయారు చేసి స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం పాల్గొన్న భక్తులందరికీ తిమ్మప్ప కొండపై. కొండ మధ్యలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

# మంత్రాలయం జనసేన ఇన్‌చార్జ్ వాల్మీకి లక్ష్మన్నకు ఘన సన్మానం





**ఆగస్టు 29 (సూర్య ఉదయం ప్రతినిధి మంత్రాలయం) :** శనివారం మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో జనసేన పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం జరిగింది. జనసేన అధినేత, ఉ పముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి, పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ నాయకులను పూలబోకేలతో ఘనంగా సన్మానించారు.2019 శాసనసభ ఎన్నికలతో పాటు, 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల త్యాగాలను మంత్రి నాదెండ్ల మనోహర్ కొనియాడారు. వైకాపా అరాచకాలను ఎదుర్కొని నిలబడిన నాయకులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.:2019 మంత్రాలయం అభ్యర్థి, ప్రస్తుత నియోజకవర్గ ఇన్‌చార్జ్ వాల్మీకి బి. లక్ష్మన్నను మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రత్యేకంగా సన్మానించారు.తమ పోరాటాలను గుర్తించి గౌరవించినందుకు పవన్ కళ్యాణ్, నాదెండ్ల మనోహర్‌లకు లక్ష్మన్నతో పాటు సన్మాన గ్రహీతలంతా కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి తరపున జనసేన జెండా ఎగురవేస్తామని నాయకులు ధీమా వ్యక్తం చేశారు.

## గుర్తింపు లేని జి ఎన్ ఎం కళాశాలల్లో అక్రమ అడ్మిషన్లు అరికట్టాలి



**సూర్య ఉదయం ఆదోని :** కర్నూలు జిల్లాలోని గుర్తింపు,అనుమతులు లేని ప్రైవేటు జి ఎన్ ఎం స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాలల్లో అక్రమంగా అడ్మిషన్లు నిర్వహిస్తూ విద్యార్థు లు,తల్లిదండ్రుల నుంచి ఫీజులు వసూలు చేస్తున్న కళాశాలలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని. ఫ్లోరెన్స్ నైటింగేల్ నర్సింగ్ స్టూడెంట్స్ అసోసియేషన్ కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాజా మొయినుద్దీన్ డిమాండ్ చేశారు. 2025--26లో దాదాపు 310 కళాశాలలకు గుర్తింపు ఉండగా, 2026--27లో సుమారు 213 కళాశాలలకు మాత్రమే గుర్తింపు/అనుమతులు ఉన్నాయని, సుమారు 97 కళాశాలలకు ఈ విద్యా సంవత్సరానికి గుర్తింపు లేకపోవడంతో అడ్మిషన్లు నిలిపివేయబడ్డాయని తెలిపారు. అయినప్పటికీ కర్నూలు జిల్లాలో గుర్తింపు లేని కొన్ని కళాశాలలు విద్యార్థుల నుంచి రూ.5,000 నుండి 10000 వరకు అడ్మిషన్ ఫీజు వసూలు చేస్తూ అక్రమ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ఆరోపించారు. డిఎంహెచ్వో వెంటనే తనిఖీలు నిర్వహించి అక్రమ అడ్మిషన్లను నిలిపివేయడంతో పాటు, నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేసిన ఫీజులను విద్యార్థులకు తిరిగి ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదోని డివిజన్ అధ్యక్షులు ముజీబ్ భాష, ఉపాధ్యక్షులు రమేష్ పాల్గొన్నారు.

## కోసిగి నూతన ఎమ్మార్వో గా గీతా ప్రియదర్శిని



**ఆగస్టు 29 (సూర్య ఉదయం ప్రతినిధి మంత్రాలయం) :** కోసిగి నూతన ఇంచార్జ్ తహసీల్దార్‌గా ఖ.గీతా ప్రియదర్శిని నియమితులయ్యారు. జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు, పెద్దకడబూరులో డిప్యూటీ తహసీల్దారుగా పనిచేస్తున్న ఆమెను డెప్యుటేషన్‌పై కోసిగికి బదిలీ చేసినట్లు అధికారులు తెలిపారు. కాగా, ఇప్పటివరకు కోసిగి తహసీల్దార్‌గా పనిచేసిన వేణుగోపాల్ రావు ఆదోని తహసీల్దార్ కార్యాలయానికి డెప్యుటేషన్‌పై బదిలీ అయినట్టు ఆయన తెలిపారు.

## గూడూరులో జఫ్ఫా టీ క్లబ్ ప్రారంభం

ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన వైసిపి జిల్లా పంచాయతీ రాజ్ విభాగ అధ్యక్షుడు పి ఎన్ అస్లాం



**సూర్య ఉదయం, గూడూరు :** గూడూరు పట్టణంలోని ఎమ్మిగనూరు రోడ్డు ఈద్గా ముందు గౌండ మహమ్మద్ జఫ్ఫా టీ క్లబ్ ను శనివారం వైసిపి జిల్లా పంచాయతీరాజ్ విభాగ అధ్యక్షుడు పీ ఎన్ అస్లాం ప్రారంభించారు. ముందుగా పి ఎన్ అస్లాం,పత్తి రంగడుకు,జింకల నాగరాజు, గౌండలాలుకు శాలువాలు కప్పి పూలమాలవేసి ఘనంగా సన్మానించారు. అనంతరం పిఎం అసలం చేతుల మీదుగా కట్ చేయించి జఫ్ఫా టీ క్లబ్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మన్న, టీవీఎస్ షోరూం ఇస్మాయిల్, డ్రైవర్ మద్దిలేటి, మదర్, ముజీబ్, చికెన్ వలి, ఇటికల షేక్షావలి, సెల్ షాప్ ఆలీం,బోజుగు ప్రభాకర్,బండల ఖలీల్, గౌండ ఇస్మాయిల్, మెకానిక్ బందినవాజ్, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ 420 హామీలు, 6 గ్యారంటీలపై నిరసనలకు బీఆర్ఎస్ సన్నాహాలు



**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్‌పల్లి :** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారంటీలు బూటకమని ఆరోపిస్తూ సెప్టెంబర్ 2వ తేదీ నుంచి నిర్వహించనున్న నిరసన కార్యక్రమాలపై బీఆర్ఎస్ పార్టీ మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా ముఖ్య నాయకులు సమావేశమయ్యారు. బీఆర్ఎస్ మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు శంబీపూర్ రాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు పాల్గొని నిరసన కార్యక్రమాల నిర్వహణ, కార్యాచరణపై చర్చించారు. సమావేశంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఉప్పల్ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. హామీలు, గ్యారంటీల అమలులో ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సెప్టెంబర్ 2 నుంచి దశలవారీగా నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

## కస్టమర్ల ఆదరణే వ్యాపార విజయానికి రహస్యం బండి రమేష్



**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్‌పల్లి :** కస్టమర్ల ఆదరణ పొందడంలోనే వ్యాపార విజయ రహస్యం దాగి ఉంటుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ అన్నారు. మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ తనయ డాక్టర్ సరిత నిజాంపేట రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన "ద స్కిన్ ఎట్లయర్" క్లినిక్‌ను బండి రమేష్, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన సేవలను నాణ్యతతో అందించడంతో పాటు, అందరికీ అందుబాటు ధరల్లో సేవలు లభించేలా చూడటం ద్వారా కస్టమర్ల ఆదరణను చూరగొనవచ్చన్నారు. వ్యాపార సంస్థలు వినియోగదారుల అవసరాలను గుర్తించి మెరుగైన సేవలు అందించినప్పుడే విశ్వసనీయత, ఆదరణ పెరుగుతాయని పేర్కొన్నారు. అనంతరం క్లినిక్ నిర్వాహకులను బండి రమేష్ అభినందించారు. నూతనంగా ప్రారంభించిన క్లినిక్ ప్రజలకు మెరుగైన చర్మ వైద్య సేవలు అందిస్తూ విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.

## కొమ్ము యాదమ్మ మృతి పట్ల వడ్డేపల్లి రాజేశ్వరరావు సంతాపం

అంతిమయాత్రలో పాల్గొని పుష్పాంజలి ఘటించిన రాజేశ్వరరావు



**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్‌పల్లి :** కూకట్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొమ్ము బాబురావు తల్లి కొమ్ము యాదమ్మ (కీ.శే.) మృతి పట్ల బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. యాదమ్మ మృతి చెందిన విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న రాజేశ్వరరావు, ఆమె అంతిమయాత్రలో పాల్గొని పుష్పాంజలి ఘటించి ఘన నివాళులర్పించారు. అనంతరం కొమ్ము బాబురావు, కుటుంబ సభ్యులను పరామర్శించిన ఆయన, యాదమ్మ మృతి పట్ల తన ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. భగవంతుడు యాదమ్మ ఆత్మకు శాంతి ప్రసాదించాలని ప్రార్థించారు.

## రాంపురం బ్రదర్స్' పేర్లతో శాశ్వత పచ్చబొట్టు వేయించుకున్న యువకుడు...




**సూర్య ఉదయం పెద్దకడబూరు :** అభిమానానికి హద్దులు లేవు. నుదుటిపై రాంపురం బ్రదర్స్ పేర్లు తోశాశ్వత పచ్చ బోట్టు వేయించు కున్న యువకుడు. అలాగునే రాజకీయాల్లో నాయకులపై అభిమానం చూపించడం సర్వసాధారణం. కానీ ఆ అభిమానం హద్దులు దాటి గుండెల్లోనే కాదు, ఏకంగా నుదుటిపై శాశ్వత ముద్రగా మారింది. మంత్రాలయం నియోజకవర్గంలో రాంపురం రెడ్డి సోదరులపై ఓ యువకుడు చూపించిన అసమాన అభిమానం ప్రస్తుతం నియోజకవర్గవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పెద్దకడబూరు మండల పరిధిలోని కంబాలదిన్నె గ్రామానికి చెందిన వైసీపీ యూత్ టీం సభ్యుడు బోయ సత్తిరెడ్డి, మంత్రాలయం శాసనసభ్యులు వై. బాలనాగిరెడ్డి, వైఎస్సార్సీపీ కర్నూలు జిల్లా ఉపాధ్యక్షులు వై. ప్రదీప్ కుమార్ రెడ్డిలపై ఉన్న అపారమైన ప్రేమను వినూత్న రీతిలో చాటుకున్నాడు. ఎవరూ ఊహించని విధంగా తన నుదుటిపై ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి, వై. ప్రదీప్ రెడ్డిల పేర్లను శాశ్వత పచ్చబొట్టు వేయించుకుని తన జీవితాంతం వారిపై ఉన్న నిబద్ధతను, అభిమానాన్ని చాటాడు.

### సోషల్ మీడియాలో వైరల్

"మా నాయకులు మా గుండెల్లోనే కాదు.. నా నుదుటి రాత కూడా వాళ్లే" అంటూ బోయ సత్తిరెడ్డి తెలిపిన అభిమానం స్థానికులను, వైఎస్సార్సీపీ శ్రేణులను విశేషంగా ఆకట్టుకుంటోంది. నుదుటిపై నాయకుల పేర్లతో ఉన్న సత్తిరెడ్డి ఫోటోలు, వీడియోలు ప్రస్తుతం నియోజకవర్గంలో మరియు సోషల్ మీడియా వేదికల్లో తెగ వైరల్ అవుతున్నాయి. బోయ వాల్మీకి సత్తిరెడ్డి మాట్లాడుతూ మంత్రాలయం నియోజవర్గంలో బోయ వాల్మీకులు కు న్యాయం జరగాలంటే కేవలం రాంపురం రెడ్డి సోదరులు అనే అది సాధ్యమని ఎలాంటి కష్టం వచ్చిన ముందుండి సహాయం చేసే వ్యక్తులు మా రాంపురం రెడ్డి సోదరులు పెద్దాయన వై సీతారామిరెడ్డి మంత్రాలయం శాసనసభ్యులు బాలనాగిరెడ్డి వైఎస్ఆర్సిపి కర్నూల్ జిల్లా ఉపాధ్యక్షులు వై ప్రదీప్ రెడ్డి యువ నాయకులు వై ధరణిధర్ రెడ్డి వీళ్లకు నేను ఒక అభిమాని కావడానికి చాలా సంతోషంగా గర్వంగా ఉందన్నారు.

## దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా రాజ్యాంగబద్ధమైన హక్కు

1950 ప్రెసిడెన్షియల్ ఆర్డర్ సవరించాలని ఎమ్మిగనూరు రౌండ్ టేబుల్ సమావేశంలో డిమాండ్



**సూర్య ఉదయం ప్రతినిధి ఎమ్మిగనూరు (న్యూస్), (ఆగస్టు 29):** "దళితుడిగా పుట్టి, దళితుడిగా బతికి, దళితుడిగానే చస్తున్నాం... కేవలం చర్చికి పోతున్నారనే సాకుతో రాజ్యాంగం కల్పించిన ఎస్సీ హోదాను లాక్కోవడం తీవ్ర అన్యాయం" అని దళిత క్రైస్తవ ఎస్సీ హోదా సాధన సమితి నాయకులు ఏ.సి. దేవదానం, కె. సునీల్ కుమార్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించారు. శనివారం ఎమ్మిగనూరులోని బెతస్థా ప్రార్థన మందిరంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. 1950 ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌లోని 3వ పేరా రాజ్యాంగ విరుద్ధమైన నల్లచట్టమని, ఇది డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాసిన రాజ్యాంగ హక్కులను కాలరాస్తోందని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 (సమానత్వం), ఆర్టికల్ 15 (మత వివక్ష రహితం), ఆర్టికల్ 25 (మత స్వేచ్ఛ)లను ఈ ఆర్డర్ ఉల్లంఘిస్తోందని పేర్కొన్నారు. దళిత హిందువులు, సిక్కులు, బౌద్ధులకు వర్తిస్తున్న ఎస్సీ హోదాను దళిత క్రైస్తవులకు నిరాకరించడం వివక్షేనని స్పష్టం చేశారు.

### ప్రధాన డిమాండ్లు

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల లోపే కేంద్ర ప్రభుత్వం 1950 ఆర్డర్‌ను సవరించి, దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదాను చట్టబద్ధం చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే శాసనసభలో తీర్మానం ప్రవేశపెట్టి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి. న్యాయం జరగని పక్షంలో సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో పాటు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు."ఇది మేము అడుగుతున్న బిచ్చం కాదు, రాజ్యాంగం ఇచ్చిన మా జన్మహక్కు. హోదా సాధించే వరకు విశ్రమించేది లేదు" అని వారు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సమితి జనరల్ సెక్రటరీ ముత్తుకూరు యాకోబు, సెక్రటరీ నాగరాజు, ట్రెజరర్ జయన్న, ఎగ్జిక్యూటివ్ సభ్యులు ప్రభాకర్, ప్రసాదు, పాస్టర్ ఏసేపు, ఎమ్మిగనూరు నియోజకవర్గ సలహాదారులు సామేలు, పాస్టర్ ప్రసాదు, ఇజ్రాయిల్, కోడుమూరు సలహాదారు నయోమి తదితరులు పాల్గొన్నారు.

## బండి రమేష్ వ్యాఖ్యలకు బీఆర్ఎస్ నేత రెడ్డి సతీష్ అరోరా కౌంటర్

### రాజకీయ ఆరోపణలకు ఆధారాలు చూపాలి



**సూర్య ఉదయం ప్రతినిధి,కూకట్‌పల్లి :** కూకట్‌పల్లి నియోజకవర్గం అభివృద్ధి ప్రదాత, హ్యాట్రిక్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుపై టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ చేసిన కబ్జా ఆరోపణలను బీఆర్ఎస్ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ రెడ్డి సతీష్ అరోరా తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కూకట్‌పల్లి నియోజకవర్గ అభివృద్ధిపై బండి రమేష్‌కు అవగాహన లేదని సతీష్ అరోరా విమర్శించారు. ప్రభుత్వ భూములు, ప్రైవేట్ భూముల విషయంలో స్పష్టత లేకుండా ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేసే విధంగా ప్రైవేట్ భూములను సైతం 22ఏ జాబితాలో చేర్చారంటూ ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. హైదర్‌నగర్‌లోని సర్వే నంబర్లు 145, 163, హస్మత్‌పేటలోని సర్వే నంబర్ 1 భూములకు సంబంధించి గతంలో కోర్టుల్లో జరిగిన న్యాయపరమైన పరిణామాలను పరిశీలించాలని కోరారు. ఆయా భూములకు సంబంధించి హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో ప్రైవేట్ వ్యక్తులకు అనుకూలంగా తీర్పులు వచ్చిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. కోర్టు తీర్పుల ఆధారంగా ప్రజలు భూములు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్నారని తెలిపారు. 1958 నుంచి ఇప్పటి వరకు ఆయా ప్రాంతాల్లో భూములకు సంబంధించిన వ్యవహారాలపై సమగ్ర విచారణ జరిపించాలని సతీష్ అరోరా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూ వ్యవహారాల్లో రాజకీయ నాయకుల పాత్ర ఏమైనా ఉందా అనే అంశాన్ని కూడా విచారణ ద్వారా వెలుగులోకి తీసుకురావాలని కోరారు. హస్మత్‌పేట సర్వే నంబర్ 1లో సుమారు రెండు దశాబ్దాల క్రితం అప్పటి ఎమ్మెల్సీ, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా ఉన్న నాయకుడికి సంబంధించిన అపార్ట్‌మెంట్లు నిర్మించారంటూ సతీష్ అరోరా ఆరోపించారు. ఈ అంశంపై దమ్ముంటే ప్రభుత్వం విచారణ జరిపించాలని సవాల్ చేశారు. అల్లాపూర్, గోపాల్‌నగర్ ప్రాంతాల్లో భూకబ్జాలకు కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులే పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. తమ పార్టీకి చెందిన ఎవరైనా అక్రమాలకు పాల్పడితే తాము సమర్థించబోమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇటీవల కొంతమంది నాయకులపై చర్యలు తీసుకున్న విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో ప్రజా జీవితంలో ఎప్పుడూ గెలవని వ్యక్తి మాధవరం కృష్ణారావును విమర్శించే స్థాయిలో లేరని బండి రమేష్‌పై సతీష్ అరోరా విమర్శలు చేశారు. గతంలో పలు రాజకీయ పార్టీల్లో కొనసాగిన బండి రమేష్ భవిష్యత్తులో ఏ పార్టీలో ఉంటారో కూడా తెలియదంటూ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బండి రమేష్ రాజకీయ వ్యవహారశైలిని గమనించాలని సతీష్ అరోరా సూచించారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో భూములకు సంబంధించిన ఆరోపణలపై బహిరంగంగా కాకుండా ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఘనంగా పిన్నెల్లి వెంకట్రామ్ రెడ్డి జన్మదిన వేడుకలు





**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్‌పల్లి :** కూకట్‌పల్లి నియోజకవర్గం వసంత్‌నగర్ డివిజన్ పరిధిలోని ఎన్‌ఆర్ఎస్ఏ కాలనీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైఎస్సార్సీపీ) యువ నాయకుడు, వ్యాపారవేత్త పిన్నెల్లి వెంకట్రామ్ రెడ్డి జన్మదిన వేడుకలు అభిమానులు, స్థానిక నాయకులు, కాలనీవాసుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిన్నెల్లి వెంకట్రామ్ రెడ్డి కేక్ కట్ చేసి అభిమానులు, నాయకులు, కాలనీవాసుల నుంచి జన్మదిన శుభాకాంక్షలు స్వీకరించారు. అనంతరం కూకట్‌పల్లి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బండి మధుసూదన్ రెడ్డి, శివా రెడ్డి, జీఎల్ఎన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సూర్య ఉదయం తెలంగాణ ఎడిటర్ బాషా, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొని భారీ కేక్ కట్ చేయించారు. పిన్నెల్లి వెంకట్రామ్ రెడ్డిని శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పిన్నెల్లి వెంకట్రామ్ రెడ్డి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వైఎస్సార్సీపీ యువ నాయకుడిగా, వ్యాపారవేత్తగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు. పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి సోదరుడైన వెంకట్రామ్ రెడ్డి, మాచర్ల నియోజకవర్గ రాజకీయాల్లో తన అన్నతో కలిసి క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. వెంకట్రామ్ రెడ్డి భవిష్యత్తులో మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని, రాజకీయంగా మరింత ఎదుగుతూ ప్రజాసేవలో ముందుండాలని, ఉన్నతమైన స్థాయికి చేరుకోవాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ జన్మదిన వేడుకల్లో అభిమానులు, స్థానిక నాయకులు, ఎన్‌ఆర్ఎస్ఏ కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని పిన్నెల్లి వెంకట్రామ్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.


## ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు




**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్‌పల్లి :** ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించడం అభినందనీయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు అన్నారు. కూకట్‌పల్లి నియోజ కవర్గంలోని కేపీహెచ్‌బీ కాలనీలో ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో మాధవ్ బాగ్ అడ్వాన్స్‌డ్ ఆయుర్వేద క్లినిక్స్ అండ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌కు రాజేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత జీవనశైలి కారణంగా మధుమేహం, గుండె సంబంధిత సమస్యలు, కొలెస్ట్రాల్, రక్తపోటు, థైరాయిడ్, అధిక బరువు వంటి సమస్యలు పెరుగుతున్నాయని తెలిపారు. ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, వ్యాధులను ముందుగానే గుర్తించేందుకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మెగా మెడికల్ క్యాంప్‌లో ఉచిత ల్యాబ్ పరీక్షలు, వైద్యుల సంప్రదింపులు, డైట్ సలహాలు, వ్యక్తిగత ఆయుర్వేద మార్గదర్శకత్వం, జీవనశైలి కౌన్సెలింగ్ వంటి సేవలను అందించడం పట్ల నిర్వాహకులను రాజేశ్వరరావు అభినందించారు. ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు ఇలాంటి ఆరోగ్య శిబిరాలను భవిష్యత్తులోనూ విస్తృతంగా నిర్వహించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కుమారస్వామి, రఘురాం, మాధవ్‌బాగ్ క్లినిక్ ప్రతినిధులు, స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి భాషపై ఎథిక్స్ కమిటీలో చర్చించాలి వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో వాడుతున్న పదజాలం, అనుచిత వ్యాఖ్యలపై ఎథిక్స్ కమిటీలో విచారణ జరపాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఎథిక్స్ కమిటీ సమావేశంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ తరఫున తమ వాదనను ఎంతో బలంగా వినిపించామని వెల్లడించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వ్యాఖ్యల వివాదం జరిగిన రోజు కేవలం కాంగ్రెస్‌కు చెందిన 23 మంది ఎమ్మెల్యేలతోనే సభలో మాట్లాడించారని... అది ఏ విధంగా 'మూడ్ ఆఫ్ ది హౌస్' అవుతుందని ప్రశాంత్ రెడ్డి ప్రశ్నించారు. కేవలం కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల ఏకపక్ష మాటలను ప్రాతిపదికగా చేసుకుని, కౌశిక్ రెడ్డి అంశాన్ని ఎథిక్స్ కమిటీ ఎజెండాలో చేర్చడం సభా సంప్రదాయాలకు విరుద్ధమని దుయ్యబట్టారు. సభా నాయకుడిగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో అనుచితంగా ప్రవర్తించడంపై చర్యలు తీసుకోవాలని ఎథిక్స్ కమిటీ చైర్మన్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశామని తెలిపారు. రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, వీర్లపల్లి శంకర్, మందుల శామ్యూల్‌లు సభలో చేసిన అసభ్య వ్యాఖ్యలు, అనుచిత హావభావాల వీడియో ఆధారాలను కూడా కమిటీకి సమర్పించామని వివరించారు. ఈ విజ్ఞప్తిపై క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని చైర్మన్ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అలాగే పాడి కౌశిక్ రెడ్డికి తన వివరణ ఇచ్చుకునే సరైన అవకాశం ఇవ్వాలని కోరామన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అసెంబ్లీలో సహకరించుకుంటున్నాయని కాంగ్రెస్ నేతలు చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని ఆయన కొట్టిపారేశారు. మంత్రి కొండా సురేఖ వ్యవహారంలో ఏం జరుగుతుందో స్పష్టత లేదని, రాజకీయాల్లో ఏదైనా జరగొచ్చని వ్యాఖ్యానించారు.

## ఓటర్ల తొలగింపుపై సీఈసీకి సీఎం రేవంత్ రెడ్డి లేఖ గడువు 4 వారాలు పొడిగించాలని విజ్ఞప్తి



తెలంగాణలో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై కేంద్ర ఎన్నికల కమిషనర్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ రాశారు. ఈ సవరణ ప్రక్రియలో భాగంగా ఏకంగా 92.86 లక్షల ఓట్ల తొలగింపుకు సంబంధించిన నోటీసులు, పరిశీలనలు వెలువడటంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అర్హులైన పౌరులెవరూ ఓటు హక్కు కోల్పోకుండా చూసేందుకు సమగ్ర పరిశీలన అత్యవసరమని కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం నిర్ణయించిన గడువులోగా నోటీసులకు స్పందించడం, అభ్యంతరాలు నమోదు చేయడం, అవసరమైన ఆధార పత్రాలను సమర్పించడం సాధారణ పౌరులకు సవాలుగా మారిందని సీఎం పేర్కొన్నారు. ముఖ్యంగా ఉపాధి కోసం తాత్కాలికంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వలస కూలీలు, రోజువారీ కూలీలు తమ ఓటు హక్కును నిరూపించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో ఓటర్ల నుంచి క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరించే సమయాన్ని మరో నాలుగు వారాల పాటు పొడిగించాలని లేఖలో స్పష్టంగా కోరారు. దీంతో పాటు, అత్యధికంగా ఓటర్ల సంఖ్య ఉన్న హైదరాబాద్, మేడ్చల్–మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాల్లో పరిశీలన ప్రక్రియ వేగంగా, పారదర్శకంగా సాగేందుకు అదనపు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లను తక్షణమే నియమించాలని సూచించారు. గ్రామసభలు, పురపాలక వార్డుల్లో ఓటర్ల జాబితాను బిగ్గరగా చదివి వినిపించాలని, పట్టణ ప్రాంతాల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసి ఎస్ఐఆర్ ప్రక్రియను వికేంద్రీకరించడం ద్వారా ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

సూర్య ఉదయం
ప్రతి పదం... ప్రజా శ్రేయస్కరం
తెలుగు దిన పత్రిక
ఆదివారం 30 - 08 - 2026

# నీటి నిల్వల ఆనవాళ్లను గుర్తించిన నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ ఉపగ్రహ చిత్రాల్లో ఏముందంటే

**నీటి నిల్వలకు సంబంధించిన ఆనవాళ్లను గుర్తించిన నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్**

**ఒకటి 19 హెక్టార్లు, మరొకటి 11 హెక్టార్ల విస్తీర్ణం మరోసారి వరద ముప్పుకు అవకాశం**



నేపాల్ ఆకస్మిక వరద విపత్తు ఘటన కలిచివేస్తోంది. వాటి తాలూకు జ్ఞాపకాలు అలా ఉండగానే మరోవైపు త్రిశూలి నదీ తీరాల్లో భారీ సరస్సులు వాటిలోని నీటినిల్వలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. హైదరాబాద్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ నీటి నిల్వలకు సంబంధించిన సరస్సులను గుర్తించాయి. ఈ సెంటర్, ఇస్రో సహకారంతో ఉపగ్రహ చిత్రాల ద్వారా ప్రభావిత ప్రాంతాలను అధ్యయనం చేస్తుంది. విలయం సంభవించిన రోజుకు ముందు ఈ ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉంది. నది ఉప్పొంగిన తర్వాత పరిస్థితులు ఎలా మారాయని నాణ్యమైన విజువల్స్ ద్వారా ఎన్ఆర్ఎస్‌సీ అన్వేషణ చేస్తోంది.రెండు నీటి నిల్వల గుర్తింపు నేపాల్‌లోని రసువా జిల్లాలో త్రిశూలి నది తీరంలో 19 హెక్టార్ల విస్తీర్ణంలో నీటితో నిండిన పెద్ద సరస్సు ఉన్నట్లు ఉపగ్రహ చిత్రాల్లో తేలింది. ఇది ప్రస్తుతం కొండ పక్కన ఉండటంతో ఎటువంటి ముప్పు లేదని అంటున్నారు. కానీ దీనిపై నిరంతర పర్యవేక్షణ తప్పనిసరిగా అవసరమని నిపుణులు భావిస్తున్నారు. దీనితోపాటు 11 హెక్టార్ల విస్తీర్ణంలో మరో సరస్సు కూడా ఉన్నట్లు గుర్తించారు. ఇది నదీ గర్భంలో ఉందని కనుగొన్నారు. అయితే టిబెట్-నేపాల్ సరిహద్దులో మంచు పర్వతాలు ఉండటం వాటి దిగువన త్రిశూలి నది అలాగే నీటి సరస్సులు ఉండటంతో ఆకస్మిక వరదలకు దారి తీస్తోందని అంటున్నారు. అక్కడ కరిగే మంచు కొండలు విరిగి సరస్సులో పడే అవకాశం ఉండటంతో ఏఏ ప్రాంతాలకు ముప్పు ఉందని విశ్లేషణ చేస్తున్నారు.వరదల్లో కొట్టకుపోయిన త్రిశూలి విద్యుత్ ప్రాజెక్ట్ కొట్టుకుపోయిన త్రిశూలి విద్యుత్ ప్రాజెక్ట్ : నేపాల్‌లోని కీలకమైన త్రిశూలి జలవిద్యుత్ కేంద్రాలు భారీగా దెబ్బతిన్నాయి. నువాకోట్ జిల్లాలోని 24 మెగావాట్ల విద్యుత్ కేంద్రం ఆకస్మిక వరదలు, బురద, రాళ్ల ధాటికి పూర్తిగా ధ్వంసమైంది. అంతేకాకుండా ఈ కేంద్రానికి ఎగువన ఉన్న భైన్సే ఆమా వంతెన కూడా కొట్టుకుపోయింది. త్రిశూలి నదిపై ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న అప్పర్ త్రిశూలి జలవిద్యుత్ ప్రాజెక్ట్ (216 మెగావాట్లు) 90 శాతం మేర దెబ్బతింది.మంత్రి పొంగులేటి ఆరా నేపాల్‌లో చిక్కుకుపోయిన తెలంగాణ వాసుల పరిస్థితి గురించి విపత్తు నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం ఆరా తీశారు. విపత్తు నిర్వహణ శాఖ, హైదరాబాద్‌లోని కంట్రోల్ రూమ్ ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ కేంద్రాల నుంచి ఆయన తాజా సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రభావిత వ్యక్తులను వీలైనంత త్వరగా గుర్తించాలని అధికారులను ఆయన ఆదేశించారు. సమాచారాన్ని సేకరించేందుకు రాష్ట్ర అధికారులు విదేశీ వ్యవహారాల శాఖతోపాటు నేపాల్‌లోని భారత రాయబార కార్యాలయంతో సమన్వయం చేసుకుంటున్నట్లు సమాచారం. రాష్ట్రం నుంచి దాదాపు 23 మంది మానస సరోవర్ యాత్రకు వెళ్లినట్లు విపత్తు నిర్వహణ శాఖ వద్ద రికార్డులు ఉన్నట్లు తెలుస్తోంది.

# రాయదుర్గంలో ఎకరం రూ.269 కోట్లు ప్రభుత్వానికి బంగారు 'గని'గా ఐటీ కారిడార్

**రికార్డులు తిరగరాసిన రాయదుర్గం భూముల వేలం**

**5.38 ఎకరాల విక్రయంతో సర్కారుకు రూ.1,447.22 కోట్ల ఆదాయం**

**భూమిని కైవసం చేసుకున్న హైదరాబాద్‌కు చెందిన వంశీరాం బిల్డర్స్**

హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్ రాయదుర్గం భూమి ధర వేలంలో రికార్డులను తిరగరాసింది. గత వారంలో నమోదైన గరిష్ఠ ధర లెక్కలను తుడిచి పెట్టి ఇప్పుడు ఏకంగా ఎకరా రూ.269 కోట్ల ధర పలికింది. 5.38 ఎకరాల విస్తీర్ణం కల్గిన ప్లాట్ పీ2 వేలం వేయగా ప్రభుత్వానికి ఎకరాకు రూ.269 కోట్ల చొప్పున మొత్తం రూ.1,447.22 కోట్ల ఆదాయం లభించింది.హైదరాబాద్‌కు చెందిన సంస్థకే తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ (టీజీఐఐసీ) శుక్రవారం నిర్వహించిన రాయదుర్గం భూముల వేలానికి వివిధ రియాల్టీ సంస్థల నుంచి ఊహించనంత స్పందన లభించింది. స్థానిక, జాతీయ రియల్ ఎస్టేట్ సంస్థలు వేలంలో పోటీపడుతూ ఉత్సాహంతో పాల్గొన్నాయి. బ్రిగేడ్ సంస్థ చివరి వరకు పోటీ పడినా హైదరాబాద్‌కు చెందిన వంశీరాం బిల్డర్స్ అనే కంపెనీ ఎకరాకు రూ.269 కోట్లతో వేలంలో భూమిని సొంతం చేసుకోవడం ఆశ్చర్యానికి గురిచేసింది. ఇది రిజర్వ్ చేసిన ధర కంటే 52.3 శాతం అధికం కావడం ఇక్కడ గమనార్హం.వారం తిరక్కుండానే ఇదే ప్రాంతంలో గత వారం నిర్వహించిన ప్లాట్ పీ1 వేలంలో ఎకరం రూ.264 కోట్ల ధర పలికింది. 5.25 ఎకరాలకు గాను ప్రభుత్వానికి రూ.1,386 కోట్ల ఆదాయం సమకూరింది. వేలం విలువలో 25 శాతాన్ని మొదటి విడతలో భాగంగా చెల్లింపుగా ఇప్పటికే ప్రభుత్వానికి సదరు సంస్థ జమ చేసిందని టీజీఐఐసీ ఉన్నతాధికారులు తెలిపారు. ప్రస్తుతం రాయదుర్గం భూములు ప్రభుత్వ ఖజానాకు బంగారు గనులుగా మారాయని రియల్ ఎస్టేట్ ప్రముఖులు మాట్లాడుకుంటున్నారు. 2025, 2026లో టీజీఐఐసీ రాయదుర్గంలో 41.74 ఎకరాల భూమిని వేలం వేయగా ఏకంగా రూ.8,457.47 కోట్ల ఆదాయం సమకూరినట్లు టీజీఐఐసీ రికార్డులు చెబుతున్నాయి.2014 నుంచి 2024 వరకు తెలంగాణ ప్రభుత్వం 31.88 ఎకరాల భూమిని వేలం వేసింది. దీనికి రూ.730.66 కోట్ల ఆదాయం సమకూరింది.2007 నుంచి 2013 వరకు 102.49 ఎకరాలను వేలం వేయగా సర్కారుకు రూ.2,143.69 కోట్ల ఆదాయం వచ్చింది.రాయదుర్గం ప్రాంతంపై దేశవ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారుల్లో బలమైన ఆసక్తికి వరుసగా రెండు వేలం పాటల్లో రికార్డు స్థాయిలో భూముల ధరలు పలకడమే ఇందుకు నిదర్శనమని టీజీఐఐసీ ఎండీ, వైస్ ఛైర్మన్ కె.శశాంక తెలిపారు.ఇక్కడ భూములకు భారీ డిమాండ్‌కు కారణమిదే : రాయదుర్గం ప్రాంతంలో అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలు ఉండటంతో



మల్టీనేషనల్ కంపెనీలు కార్యాలయాల ఏర్పాటు కోసం లీజు, లేదా అద్దెకు తీసుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నాయి. బెంగళూరు, పుణె, ముంబయి, దిల్లీ వంటి మహానగరాలతో పోలిస్తే కాస్ట్ ఆఫ్ లివింగ్ తక్కువగా ఉండటం, మానవ వనరుల లభ్యత ఎక్కువగా ఉండటంతో జీసీసీలు, డేటా సెంటర్లు ఏర్పాటు అవుతున్నాయి. దీంతో రియల్ ఎస్టేట్ సంస్థలు విశాలమైన స్థలాలు కొనుగోలు చేసి భారీ స్కైటవర్స్ వంటి భవనాలను నిర్మించి లీజుకు ఇస్తున్నాయి. టీజీఐఐసీ వేలం వేసే భూములకు సంబంధించి ఎటువంటి వివాదాలు ఉండవనే ఉద్దేశంతో స్థిరాస్తి సంస్థలు విలువైన భూములను దక్కించుకోవడానికి తీవ్రంగా పోటీ పడుతున్నాయి. దీంతో ఎకరం ధర గత రికార్డు బద్దలుకొట్టి రూ.269 కోట్లకు పలకడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తుంది.

# పెరుగుతున్న డ్రగ్స్ కేసులే అతి పెద్ద సవాల్ డీజీపీ సీవీ ఆనంద్

**రాష్ట్రంలో మూడేళ్లలో 7.15 శాతం పెరిగిన నేరాలు**

**డగ్స్ కేసుల్లో టాప్‌లో నిలిచిన సైబరాబాద్**

**ఫీల్డ్ లెవల్ పోలీసింగ్‌ను బలోపేతం చేయాలని డీజీపీ ఆదేశం**



ఉన్నతాధికారులు నేరాల సమీక్షను కేవలం కాగితాలకే, గణాంకాలకే పరిమితం చేయకూడదని అధికారులకు డీజీపీ సీవీ ఆనంద్ సూచించారు. హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో నిర్వహించిన అర్ధవార్షిక నేర సమీక్ష సమావేశంలో సిబ్బందికి ఆయన దిశానిర్దేశం చేశారు. ప్రతి నేరం వెనుక ఉన్న కారణాలు, నేరస్థుల పద్ధతులు దర్యాప్తుతో పాటు కేసుల పరిష్కారాన్ని లోతుగా విశ్లేషించినప్పుడే క్రైమ్‌రేట్‌ను సమర్థవంతంగా కట్టడి చేయగలమని డీజీపీ వెల్లడించారు. పోలీస్ శాఖలో క్షేత్రస్థాయి పరిశోధన, ప్రొఫెషనల్ స్టాండర్డ్స్ పెంపొందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీవీ ఆనంద్ ఆదేశించారు.ప్రతీ నెలా క్రైమ్ రివ్యూ తప్పనిసరి డిజిటల్ పోలీసింగ్ విధానానికి ప్రాధాన్యమిస్తూ, గతంలో 70 శాతంగా ఉన్న సీసీటీఎన్ఎస్ డేటా నవీకరణను అధికారుల సమష్టి కృషితో 96 శాతానికి తీసుకెళ్లడం పట్ల ఆయన అభినందించారు. ప్రతీ నెలా క్రైమ్ రివ్యూ సమావేశాలు తప్పనిసరిగా నిర్వహించాలని, అన్ని జోన్ల డీఐజీలు, మల్టీజోన్ ఐజీలు ఇన్‌స్పెక్షన్ నోట్స్ పరిశీలిస్తూ పోలీస్ స్టేషన్ల తనిఖీలను విస్తృతం చేయాలని ఆదేశించారు.పోలీసులకు కొత్త సవాళ్లు రాష్ట్రంలో తీవ్ర నేరాలు, సైబర్, ఆర్థిక నేరాలు తగ్గుముఖం పట్టినప్పటికీ మాదకద్రవ్యాలు, సాధారణ నేరాలు, ట్రాఫిక్ నేరాల సంఖ్య పెరగడం పోలీస్ రంగానికి ప్రధాన సవాలుగా మారిందన్నారు. గత ఏడాదితో పోలిస్తే తీవ్ర నేరాల్లో 10.33% తగ్గుదల నమోదు కాగా, హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఇవి 26.23% మేర తగ్గిన్నట్లు డీజీపీ వెల్లడించారు. సైబర్ నేరాలు 13.29%, ఆర్థిక నేరాలు 13.28% మేర క్షీణించి ఊరటనిచ్చాయిని ఆయన వివరించారు. మహిళలు, చిన్నారులపై నేరాలు గత ఏడాదితో పోలిస్తే ఈ నేరాలు 1.54% తగ్గాయిని తెలిపారు.సవాలుగా మారిన సైబరాబాద్ మూడేళ్ల కాలంలో నార్కోటిక్ కేసులు ఏకంగా 46.10% పెరిగాయి. సైబరాబాద్‌లో 90.98%, వరంగల్‌లో 142.31% మేర కేసులు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. వ్యవస్థీకృత నేరాలు 25 నుండి 451కి చేరాయి. రాష్ట్రంలో మొత్తం నేరాల సంఖ్య మూడేళ్లలో 7.15% పెరిగి 2,84,363కు చేరగా, ట్రాఫిక్ నేరాలు 9.48% వృద్ధి చెందాయని సమీక్షలో డీజీపీ వెల్లడించారు.ఆనంద్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో కృత్రిమ మేధ ఆధారిత పోలీసింగ్ అప్లికేషన్లు, టీజీ-కాప్, హాక్-ఐ, ఐసీజేఎస్, ఈగల్ కార్యకలాపాలపై అధికారులు ప్రత్యేక ప్రజెంటేషన్లు ఇచ్చారు. యువ ఐపీఎస్ అధికారులు తీసుకొచ్చిన నూతన సాంకేతిక ఆవిష్కరణలను, లొంగిపోయిన మావోయిస్టుల పునరావాస చర్యలను డీజీపీ సమీక్షించారు.సమర్థవంతమైన బేసిక్ పోలీసింగ్, సమయానుకూల డేటా విశ్లేషణ, క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారుల నిరంతర పర్యవేక్షణ ద్వారానే రాష్ట్రంలో శాంతిభద్రతలను పటిష్టం చేయగలమని ఈ సమావేశంలో డీజీపీ సీవీ ఆనంద్ అధికారులకు అదేశించారు. ఈ ఉన్నత స్థాయి సమీక్షలో డీజీ లా అండ్ ఆర్డర్ మహేష్ భగవత్, సీఐడీ డైరెక్టర్ శిఖా గోయెల్, ఉమెన్ సేఫ్టీ డైరెక్టర్ చారు సిన్హా, ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్యాతో పాటు కమిషనర్లు, అన్ని జిల్లాల ఎస్పీలు పాల్గొన్నారు.

# అన్నవరం కొండపైనే మద్యం సీసాల కలకలం టోల్‌గేటు వద్ద నామమాత్రంగా తనిఖీలు

**పెళ్లి బృందంపై ఆకతాయిల దాడి**

**బుట్టదాఖలైన ఇంటెలిజెన్స్ నివేదికలు**

**ఇకపై కట్టుదిట్టం చేస్తామన్న ఈవో**


ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం దేవస్థానంలో భద్రతా వ్యవస్థ ప్రశ్నార్థకంగా మారింది. సత్యదేవుని దర్శనం కోసం వచ్చే భక్తులు, వివాహాల కోసం వచ్చే పెళ్లి బృందాలకు కనీస రక్షణ కరవైంది. సిబ్బంది నిర్లక్ష్యంతో పవిత్రమైన కొండపైకి నిషేధిత వస్తువులు యథేచ్ఛగా చేరిపోతున్నాయి. టోల్‌గేటు వద్ద భద్రతా సిబ్బంది తనిఖీలను గాలికి వదిలేయడంతో ప్రతిరోజూ ఎన్నో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.నిబంధనల ప్రకారం కొండపైకి ఎలాంటి నిషేధిత వస్తువులు తీసుకువెళ్లకూడదు. సిగరెట్లు, మద్యం, మాంసం, ఇతర మతాల చిహ్నాలను పైకి అనుమతించరు. ఈ మేరకు టోల్‌గేటు వద్ద పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని గతంలోనే అధికారులు కచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు. కానీ ఈ నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదు. రాత్రి వేళల్లో వాహన చోదకులు మద్యం తాగి ఉన్నారో లేదో కనీసం పరీక్షించడం లేదు. బ్రీత్ అనలైజర్ తనిఖీలు జాడలేవు.పెళ్లి బృందంపై దాడి సిబ్బంది నిర్లక్ష్యమే అవాంఛనీయ ఘటనలకు కారణమవుతోంది. బుధవారం రాత్రి కొండపైకి వచ్చిన ఒక పెళ్లి బృందంపై కొందరు యువకులు దాడికి పాల్పడ్డారు. తనిఖీలు లేకపోవడం వల్లే ఆకతాయిలు రెచ్చిపోతున్నారని భక్తులు మండిపడుతున్నారు. హరిహరసదన్ ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలో పరిస్థితి దారుణంగా ఉంది. అక్కడ ఎక్కడ పడితే అక్కడ మద్యం ఖాళీ సీసాలు దర్శనమిస్తున్నాయి. దీన్ని బట్టి చూస్తే భద్రతా వైఫల్యం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. గతంలో టోల్‌గేటు వద్ద వాహనాల్లో మద్యం పట్టుబడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. అయినా సిబ్బంది చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.తిరుమల తరహా భద్రత ఏదీ : తిరుమల అలిపిరి టోల్‌గేటు వద్ద కట్టుదిట్టమైన తనిఖీలు ఉంటాయి. అన్నవరంలోనూ అలాంటి వ్యవస్థను ఏర్పాటు చేయాలని గతంలో దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాలు ఇచ్చారు. వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. లగేజీ స్కానర్, మెటల్ డిటెక్టర్, హ్యాండ్ హెల్డ్ డిటెక్టర్లతో ప్రతి ఒక్కరినీ తనిఖీ చేయాలన్నారు. కానీ ఆ దిశగా ఒక్క అడుగు కూడా పడలేదు. కనీసం ఆలయం వద్ద కూడా సరైన తనిఖీలు లేవు. భక్తులు తమ బ్యాగులతో నేరుగా గుడిలోకి వెళ్తున్నా సిబ్బంది చోద్యం చూస్తున్నారు.అన్నవరం భద్రతపై ఇంటెలిజెన్స్ అధికారులు రెండుసార్లు నివేదికలు ఇచ్చారు. 2012లో, అలాగే 2020లో భద్రతా లోపాలను ఎత్తిచూపుతూ పలు సూచనలు చేశారు. కొండపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ఆ నివేదికలను అధికారులు బుట్టదాఖలు చేశారు. వాటిని అమలు చేయడంలో ఉన్నతాధికారులు పూర్తిగా విఫలమయ్యారు.ఏటా రూ.5 కోట్ల ఖర్చు భద్రత కోసం దేవస్థానం



భారీగానే నిధులు వెచ్చిస్తోంది. ఏటా సుమారు రూ.5 కోట్లను భద్రతా సిబ్బంది జీతాల కోసం ఖర్చు చేస్తున్నారు. ప్రస్తుతం కొండపై 100 మంది ప్రైవేటు భద్రతా సిబ్బంది ఉన్నారు. వీరితో పాటు దేవస్థానం, ఎస్‌పీఎఫ్ సిబ్బంది, హోంగార్డులు మరో 70 మంది విధులు నిర్వహిస్తున్నారు. ఇంతమంది ఉన్నా ఫలితం అంతంతమాత్రంగానే ఉంటోంది. టోల్‌గేటు వద్దే కాకుండా, మెట్ల మార్గంలోనూ ఎలాంటి తనిఖీలు లేవు. రాత్రివేళల్లో భద్రతా సిబ్బంది పెట్రోలింగ్ సక్రమంగా చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.'ఇకపై భద్రత కట్టుదిట్టం' ఈ భద్రతా వైఫల్యాలపై అన్నవరం దేవస్థానం ఈవో చక్రధరరావు స్పందించారు. "కొండపై ఇక నుంచి భద్రతను మరింత కట్టుదిట్టం చేస్తాం. టోల్‌గేటు వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే పైకి అనుమతిస్తాం. పటిష్టమైన చర్యలు తీసుకుంటాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని విధాలా అప్రమత్తంగా ఉంటాం" అని ఆయన స్పష్టం చేశారు.

# రోగుల 'ఊపిరి'కి సంజీవని కోలజీ బయోసైన్సెస్ సరికొత్త ఔషధాలు

హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి చెందిన 'కోలజీ బయోసైన్సెస్' అనే స్టార్టప్, ప్రాణాంతకమైన ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న రోగుల జీవితకాలాన్ని గణనీయంగా పెంచగల ఔషధాలను అభివృద్ధి చేసింది. హెచ్‌సీయూలోని యాస్పైర్ బయోనెస్ట్ ప్రొఫెసర్ల సహకారంతో మూడు సంవత్సరాల క్రితం రెండు నిర్దిష్ట వ్యాధులపై పరిశోధన ప్రారంభమైంది. ఆశాజనకమైన ప్రయోగాత్మక ఫలితాల దృష్ట్యా, రాబోయే రెండు సంవత్సరాలలో ఈ ఔషధాలను మార్కెట్లో విడుదల చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి.ఇడియోపతిక్ పల్మనరీ ఫైబ్రోసిస్ ఇడియోపతిక్ పల్మనరీ ఫైబ్రోసిస్ ప్రధానంగా అధికంగా ధూమపానం చేసేవారిని ప్రభావితం చేస్తుంది. రోగులు ముఖ్యంగా రాత్రిపూట, తీవ్రమైన దగ్గుతో బాధపడతారు. ఈ పరిస్థితి 2 నుంచి 3 సంవత్సరాలలో ప్రాణాంతకం కావచ్చు. గత సంవత్సరం మెటా అంచనా ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఈ వ్యాధి ప్రాబల్యం ప్రతి లక్ష మందికి 5.8 కేసులుగా ఉంది. నిర్దిష్ట చికిత్సలపై పరిశోధన కొనసాగుతోంది.ప్రస్తుతం, రోగులకు ఊపిరితిత్తుల వ్యాధుల కోసం సాధారణ మందులతో చికిత్స అందిస్తున్నారు. కోలజీ బయోసైన్సెస్ లోని శాస్త్రవేత్తలు ఇప్పుడు నోటిలో ఉంచిన నిమిషంలోనే కరిగిపోయే ఒక ఫిల్మ్ రూపంలో ఔషధాన్ని అభివృద్ధి చేశారు. భారతదేశంలో ప్రస్తుతం ఐపీఎఫ్ చికిత్సకు ఒక రోగికి సంవత్సరానికి రూ.53,460 ఖర్చవుతుండగా కొత్తగా అభివృద్ధి చేసిన మందు ధర కేవలం రూ.32,400 మాత్రమే ఉంటుందని అంచనా.పిల్లలలో ఒక అరుదైన వ్యాధి సిస్టిక్ ఫైబ్రోసిస్ అనేది ఒక జన్యుపరమైన రుగ్మత. ఇది ఐదేళ్లలోపు పిల్లలను ఎంతగానో ప్రభావితం చేస్తోంది. ఈ వ్యాధి కారణంగా శరీరం చిక్కటి, జిగురులాంటి శ్లేష్మాన్ని ఉత్పత్తి చేస్తుంది. ఇది శ్వాస మార్గాలను



అడ్డుకుని, ఊపిరితిత్తులను దెబ్బ తీస్తుంది. దేశంలో ప్రతి సంవత్సరం 1,560 మంది పిల్లలు ఈ వ్యాధితో జన్మిస్తున్నారు. వారిలో 95% మంది బతకలేకపోతున్నారు. ఈ పిల్లలను కాపాడటానికి సంవత్సరానికి రూ.1.20 కోట్ల ఖర్చు అవసరం. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కేవలం ఒకే ఒక కంపెనీ అవసరమైన మందును తయారు చేస్తోంది. దీనిని దేశంలో ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో, కోలజీ బయోసైన్సెస్ ఇటీవల ఒక కొత్త మందును అభివృద్ధి చేసింది.ప్రస్తుతం అందుబాటులో ఉన్న మందులతో కూడా ఐపీఎఫ్ రోగులు 2 నుంచి 3 సంవత్సరాలలోపు మరణించే అధిక ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నారు. మేం తయారు చేసే మందును ఉపయోగించడం వల్ల వారి జీవితకాలం 7 నుంచి 8 సంవత్సరాల వరకు పెరగవచ్చు. ప్రస్తుత చికిత్సా విధానాల ప్రకారం సిస్టిక్ ఫైబ్రోసిస్ ఉన్న పిల్లలు పది సంవత్సరాలు బతికే అవకాశాలు ఉంటాయి. మేం అభివృద్ధి చేసిన మందు 50 నుంచి 60 సంవత్సరాలు జీవించేలా చేస్తుంది. మేం ఈ మందులను 2 సంవత్సరాలలోపు అందుబాటులోకి తీసుకువస్తాం - ఎం. శ్రీదేవి, సీఈఓ, కోలజీ బయోసైన్సెస్

# విశాఖలో దారుణం ఇద్దరు చిన్నారులతో కలిసి దంపతుల ఆత్మహత్య

**పెందుర్తి పరిధిలోని చింతల అగ్రహారంలో విషాద ఘటన**

**రాత్రి సమయంలో సెల్‌ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు అంటూ సందేశం పంపినట్లు సమాచారం**



విశాఖ జిల్లాలో దారుణం జరిగింది. ఇద్దరు చిన్నారులకు విషమిచ్చి దంపతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. పెందుర్తి పరిధిలోని చింతల అగ్రహారంలో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. కొత్తవలసకు చెందిన మల్ల ప్రవీణ్ కుమార్ కొంతకాలంగా జీవనోపాధి కోసం పెందుర్తిలోని అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ప్రవీణ్ ఆటో డ్రైవర్‌గా, అతని భార్య కాయగూరల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ దంపతులకు రెండేళ్లు, మూడేళ్ల వయసున్న ఇద్దరు చిన్నారులు ఉన్నారు. రాఖీ పండుగ సందర్భంగా శుక్రవారం కుటుంబ సభ్యులతో రాఖీలు కట్టించుకున్న ప్రవీణ్ కుమార్.. రాత్రి సమయంలో సెల్‌ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు '=ఖ్రా' అంటూ సందేశం పంపినట్లు సమాచారం.ఆ తర్వాత ప్రవీణ్ కుమార్ అతని భార్యతో పాటు ఇద్దరు చిన్నారులు విషపదార్థం తినిపించి తాను ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు తల్లి, ఇద్దరు బిడ్డలను వెంటనే ఆస్పత్రికి తరలించగా..అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. రాఖీ పండుగ రోజున కుటుంబ సభ్యులతో సంతోషంగా గడిపిన అనంతరం చోటుచేసుకున్న ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు కుటుంబ కలహాలా.. ఆర్థిక ఇబ్బందులు కారణమా అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు.

# జగద్గిరిగుట్టలో ట్రాఫిక్ పోలీసుగా మారి.. ట్రాఫిక్‌ను క్లియర్ చేసిన కండక్టర్

**రాఖీ పౌర్ణమి రద్దీలో ట్రాఫిక్ పోలీసుగా మారిన కండక్టర్**

**మేడ్చల్ జిల్లా జగద్గిరిగుట్ట జంక్షన్‌లో ఘటన**

**భారీగా నిలిచిపోయిన వాహనాలతో ఇబ్బందులు**

**బస్సు దిగి స్వయంగా ట్రాఫిక్‌ను నియంత్రించిన ఉద్యోగి**

విధి నిర్వహణలో నిబద్ధతతో పాటు సామాజిక బాధ్యతను ప్రదర్శిస్తే ప్రజల నుంచి విశేషమైన ప్రశంసలు లభిస్తాయి. సరిగ్గా ఇదే రీతిలో ఒక ఆర్టీసీ కండక్టర్ చేసిన కృషి ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. రాఖీ పౌర్ణమి వేళ ఏర్పడిన భారీ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ఆయన స్వయంగా రంగంలోకి దిగి ట్రాఫిక్ పోలీసుగా బాధ్యతలు నిర్వహించారు.మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ పరిధిలోని జగద్గిరిగుట్ట ఔట్‌పోస్ట్ జంక్షన్‌లో శుక్రవారం రాఖీ పండుగ దృష్ట్యా వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. పండుగ పూట తమ స్వస్థలాలకు వెళ్లే ప్రయాణికులతో ఆ ప్రాంతంలో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో వాహనదారులు, సామాన్య ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సరిగ్గా అదే సమయంలో అటుగా వెళుతున్న ఆర్టీసీ బస్సులోని కండక్టర్ ఈ పరిస్థితిని గమనించారు.పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకున్న ఆయన వెంటనే బస్సు దిగి రోడ్డుపైకి వచ్చి, స్వయంగా ట్రాఫిక్‌ను నియంత్రించడం ప్రారంభించారు. ఆయన చూపిన చొరవతో కొద్దిసేపటికే ట్రాఫిక్ సమస్య సద్దుమణిగి, వాహనాల రాకపోకలు సజావుగా సాగాయి. ఓ పౌరుడు ఈ దృశ్యాలను తన కెమెరాలో బంధించి సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా, ఆ వీడియో క్షణాల్లో వైరల్ అయింది. సదరు కండక్టర్ బాధ్యతాయుత ప్రవర్తనపై నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

# రెడ్ క్రాస్ సేవలకు గుర్తింపు ఏడుగురు కలెక్టర్లకు స్వర్ణ పతకాలు

**ఆంధ్రప్రదేశ్‌లో ఏడుగురు జిల్లా కలెక్టర్లకు గవర్నర్ స్వర్ణ పతకాలు**

**రెడ్ క్రాస్ సేవలకు గాను ఈ పురస్కారాలకు ఎంపిక**

**సెప్టెంబర్ 1న విజయవాడలో అవార్డుల ప్రదానం**

**ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జనరల్ బాడీ మీటింగ్‌లో ప్రకటన**

ఆంధ్రప్రదేశ్‌లోని ఏడుగురు జిల్లా కలెక్టర్లు ప్రతిష్ఠాత్మక గవర్నర్ స్వర్ణ పతకాలకు ఎంపికయ్యారు. తమ జిల్లాల్లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్) ద్వారా అందించిన విశేష సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాలను ప్రకటించారు. సెప్టెంబర్ 1వ తేదీన విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్న రెడ్ క్రాస్ రాష్ట్ర శాఖ వార్షిక సర్వసభ్య సమావేశంలో గవర్నర్ చేతుల మీదుగా ఈ పతకాలను అందజేయనున్నారు.ఈ పురస్కారాలకు ఎంపికైన వారిలో పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాని, నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, బాపట్ల జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ ఉన్నారు. వీరితో పాటు కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, కాకినాడ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్, నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఈ గౌరవాన్ని అందుకోనున్నారు.ఇటీవల జరిగిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సర్వసభ్య సమావేశంలో ఈ ఎంపికను ఖరారు చేశారు. జిల్లా స్థాయిలో రెడ్ క్రాస్ కార్యకలాపాలను సమర్థవంతంగా సమన్వయం చేస్తూ, ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించినందుకు గాను ఈ కలెక్టర్లను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు.

# భోజనం తర్వాత పైనాపిల్.. ఎంత మేలు చేస్తుందో తెలుసా

**పైనాపిల్‌లోని బ్రోమెలైన్ ప్రొటీన్ల జీర్ణక్రియకు తోడ్పాటు**

**భోజనం తర్వాత పైనాపిల్ తీసుకోవడం ఉపయోగకరం**

**దీంట్లోని ఫైబర్ ప్రేగుల ఆరోగ్యానికి తోడ్పాటు**

**యాంటీఆక్సిడెంట్‌గా పనిచేసే విటమిన్-సి**

**మితంగా తింటే కడుపు ఉబ్బరం తగ్గే అవకాశం**



భోజనం తర్వాత పైనాపిల్ ముక్కలు తినడం చాలామందికి ఇష్టం. రుచితో పాటు జీర్ణక్రియకు కూడా ఇది ఉపయోగపడొచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. పైనాపిల్‌లో ఉండే 'బ్రొమెలైన్' అనే ఎంజైమ్ ఇందుకు ప్రధాన కారణం. ఇది ఆహారంలోని సంక్లిష్ట ప్రొటీన్లను చిన్న భాగాలుగా విడగొట్టడంలో సహాయపడుతుంది.

### ప్రొటీన్ల జీర్ణక్రియకు..

మాంసం, చేపలు, గుడ్లు, పాల ఉత్పత్తులు, పప్పుల్లో ప్రొటీన్లు అధికంగా ఉంటాయి. వీటిని జీర్ణం చేయడానికి శరీరంలోని ఎంజైమ్‌లు పనిచేస్తాయి. పైనాపిల్‌లోని బ్రొమెలైన్ కూడా ప్రొటీన్లను చిన్న పెప్టైడ్లు, అమైనో ఆమ్లాలుగా విడగొట్టే ప్రక్రియకు తోడ్పడుతుంది.

### భోజనం తర్వాత ఎందుకు

భోజనం పూర్తయ్యాక జీర్ణవ్యవస్థ ఆహారాన్ని విచ్ఛిన్నం చేసే పనిలో ఉంటుంది. ఈ సమయంలో పైనాపిల్ తీసుకోవడం వల్ల బ్రొమెలైన్ జీర్ణక్రియకు అదనపు సహకారం అందించొచ్చని అధ్యయనాలు సూచిస్తున్నాయి. భోజనం చేసిన తర్వాత కలిగే కడుపు ఉబ్బరం, అసౌకర్యాన్ని కొంతవరకు తగ్గించడంలో కూడా ఇది ఉపయోగపడొచ్చని చెబుతున్నారు.

### మరిన్ని ప్రయోజనాలు

పైనాపిల్‌లో ఫైబర్, విటమిన్-సి, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఫైబర్ పేగుల కదలికలకు తోడ్పడుతుంది. విటమిన్-సి శరీరానికి అవసరమైన యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. పైనాపిల్‌ను మితంగా తీసుకోవడం వల్ల కడుపు ఉబ్బరం వంటి స్వల్ప జీర్ణ సమస్యల్లోనూ ఉపశమనం లభించొచ్చని సమాచారం.

### ఎంత తినాలి

100 గ్రాముల పైనాపిల్‌లో సుమారు 48 క్యాలరీలు, 11-12 గ్రాముల కార్బోహైడ్రేట్లు, 1.4 గ్రాముల ఫైబర్, 39 మిల్లీగ్రాముల విటమిన్-సి ఉంటాయి. భోజనం తర్వాత దాదాపు ఒక కప్పు తాజా పైనాపిల్ ముక్కలు తీసుకోవచ్చని సూచిస్తున్నారు. అయితే వ్యక్తి ఆరోగ్యం, ఆహార అలవాట్లను బట్టి పరిమాణం మారొచ్చు.

### అందరికీ సరిపోదు

పైనాపిల్‌ను ఎక్కువగా తింటే నోటిలో మంట, చికాకు కలగొచ్చు. ఈ పండుతో అలర్జీ ఉన్నవారు దూరంగా ఉండాలి. బ్రొమెలైన్ సప్లిమెంట్లను వైద్యుల సూచన లేకుండా తీసుకోవద్దని నిపుణులు సూచిస్తున్నారు. పైనాపిల్ జీర్ణక్రియకు తోడ్పడొచ్చు కానీ శరీరంలోని సహజ జీర్ణవ్యవస్థకు ప్రత్యామ్నాయం కాదు.

# టైమ్‌పాస్ కోసం 'సిగరెట్' తాగుతున్నారా ఈ హెచ్చరిక సంకేతాలతో అలర్ట్ కావాల్సిందే

**పొగాకు ఉత్పత్తులతో ఆరోగ్యానికి ప్రమాదం**

**ఈ లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయొద్దంటున్న నిపుణులు**



పొగాకు వాడకం అనేది ప్రారంభంలో ఎవరికీ ఒక వ్యసనంలా అనిపించదు. అది రోజువారీ జీవితంలో ఒక సాధారణ అలవాటుగా మెల్లగా మొదలవుతుంది. ఫ్రెండ్స్‌తో కలిసి సిగరెట్ పంచుకోవడం, ఒత్తిడితో కూడిన రోజూవారీ పనిలో కాస్త విరామం తీసుకుని పొగతాగడం లేదా భోజనం తర్వాత గుట్కా/పొగాకు నమలడం వంటివి త్వరలోనే వదిలించుకోలేనంతగా ఒక దినచర్యగా మారిపోతాయి. ఈ అలవాటు ప్రారంభంలో అపాయం లేదని అనిపించినప్పటికీ, కాలక్రమేణా శరీరంలోని దాదాపు ప్రతి అవయవం క్రమంగా దెబ్బతింటుందని నిపుణులు చెబుతున్నారు. ఏదైనా తీవ్రమైన వ్యాధి బయటపడటానికి చాలా కాలం ముందే, శరీరం కొన్ని చిన్న చిన్న హెచ్చరిక సంకేతాలను ఇస్తుందంటున్నారు. మరి, ఆ ముందస్తు హెచ్చరిక సంకేతాలేంటో ఇప్పుడు చూద్దాం.శరీరంలోని దాదాపు ప్రతి అవయవాన్ని పొగాకు దెబ్బతీస్తుంది, దీనివల్ల క్యాన్సర్, గుండె జబ్బులు, పక్షవాతం, ఊపిరితిత్తుల వ్యాధులు, సంతానోత్పత్తి సామర్థ్యం తగ్గడం, రోగనిరోధక శక్తి బలహీనపడటం, అకాల మరణం వంటివి సంభవిస్తాయని ఔనూ పేర్కొంది. ఈ క్రమంలో శరీరం ఇచ్చే హెచ్చరిక సంకేతాలు అకస్మాత్తుగా బయటపడవు. సాధారణంగా చాలా ఏళ్లపాటు పొగాకు వాడిన తర్వాతే ఇవి మెల్లగా కనిపిస్తాయి. ఈ నిదానమైన మార్పుల వల్లే చాలామంది "నేను బాగానే ఉన్నాను కదా" అని భ్రమపడుతుంటారు. కానీ, పొగాకు వల్ల వచ్చే తీవ్రమైన వ్యాధుల స్పష్టమైన సంకేతాలను మనం అస్సలు నిర్లక్ష్యం చేయకూడదని నిపుణులు సూచిస్తున్నారు.దీర్ఘకాలిక దగ్గు రెండు మూడు వారాల కంటే ఎక్కువ కాలం పాటు ఉంటూ, రోజురోజుకూ తీవ్రమయ్యే దగ్గును నిర్లక్ష్యం చేయవద్దని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా, శ్వాస తీసుకునేటప్పుడు పిల్లికూతలు లేదా వింత శబ్దాలు లాంటిని అశ్రద్ధ చేయవద్దని అంటున్నారు.కారణం లేని అలసట చాలామంది కొద్ది దూరం నడిచినా లేదా రెండు మెట్లు ఎక్కినా శ్వాస ఆడకపోవడం, విపరీతంగా అలసిపోతుంటారు. అయితే, దీనిని సాధారణ అలసటగా తీసుకోవద్దని చెబుతున్నారు.బరువులో మార్పులు కొంతమంది ఎలాంటి ప్రయత్నం లేకుండానే హఠాత్తుగా బరువు తగ్గిపోతుంటారు. పొగాకు వాడకం వల్ల శరీరంలో అంతర్గతంగా మొదలయ్యే తీవ్రమైన వ్యాధులకు ఇది ఒక ముఖ్యమైన సంకేతం కావచ్చని నిపుణులు చెబుతున్నారు.రొమ్ము క్యాన్సర్ ముప్పును తగ్గించే సూపర్ ఫుడ్స్ - ఆహారంలో వీటిని చేర్చుకుంటే మేలంటున్న నిపుణులు.నోటి సమస్యలు పొగాకు వల్ల వచ్చే నోటి క్యాన్సర్ ప్రారంభంలో తగ్గని నోటి పూత (అల్సర్లు), నోటి లోపల తెల్లటి లేదా ఎర్రటి మచ్చలు, దవడ గట్టిపడటం వంటి రూపాల్లో కనిపిస్తుందని నిపుణులు చెబుతున్నారు. మొదట్లో ఇవి పెద్దగా నొప్పి లేదా ఇబ్బంది కలిగించకపోవడం వల్ల చాలా మంది వీటిని నిర్లక్ష్యం చేస్తారట.గొంతు సమస్యలు గొంతు బొంగురుపోవడం లేదా నిరంతరం గొంతు మంటగా ఉండటం వంటి శాశ్వత మార్పులను తేలికగా తీసుకోవద్దని నిపుణులు చెబుతున్నారు. ఇవి లోపల పెరుగుతున్న తీవ్రమైన సమస్యలకు సంకేతాలు కావచ్చంటున్నారు.ఈ సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి వైద్య సహాయం తీసుకోవడం చాలా ముఖ్యమని పేర్కొంటున్నారు. దీనివల్ల శస్త్రచికిత్స వంటి కఠినమైన చికిత్సల అవసరం తప్పడమే కాకుండా, వ్యాధి నుంచి మరింత సులభంగా కోలుకోవచ్చని చెబుతున్నారు.ఊపిరితిత్తులు పొగాకు ప్రభావం కేవలం ఊపిరితిత్తులకే పరిమితం కాదట. ఇది శరీరం మొత్తాన్ని దెబ్బతీస్తుందని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల వచ్చే దీర్ఘకాలిక సమస్యల లక్షణాలను చాలామంది గుర్తించలేకపోతుంటారని అంటున్నారు. పొగ ఊపిరితిత్తులకు చేరినప్పుడు, అది అక్కడి చిన్న గాలి సంచులలోకి ప్రయాణించి వాటిని దెబ్బతీస్తుందని పేర్కొంది.గుండె, రక్తనాళాపై ఒత్తిడి పొగాకు వల్ల శరీరంలో విషపూరిత పదార్థాలు చేరుతాయని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల తరచుగా తల తిరగడం, ఛాతీ బరువుగా లేదా నొప్పిగా అనిపించడం వంటి తీవ్రమైన గుండె సమస్యల సంకేతాలు కనిపిస్తాయంటున్నారు.శారీరక అసౌకర్యం తరచూ వచ్చే తలనొప్పి లేదా కాళ్ల వాపు వంటి లక్షణాలను తేలికగా తీసుకోకూడదని నిపుణులు చెబుతున్నారు. ఇవి పొగాకు వాడకం వల్ల రక్తనాళాలు దెబ్బతింటున్నాయని చెప్పడానికి సంకేతాలు కావచ్చంటున్నారు.నివారణ మనకు అందుబాటులో ఉన్న అత్యంత ముఖ్యమైన పరిష్కారం సంక్లిష్టమైన శస్త్రచికిత్స కాదు. వ్యాధిని ప్రారంభ దశలోనే కచ్చితంగా గుర్తించాలని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల పెద్దగా కోతలు లేని సాధారణ చికిత్సలతోనే వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చని తెలియజేస్తున్నారు.మానవ శరీరానికి స్వయంగా కోలుకునే అద్భుతమైన శక్తి ఉంది. పొగాకు వాడకాన్ని ఆపిన మరుక్షణమే, రక్తప్రసరణ పెరగడం, ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపడటం వంటి సానుకూల మార్పులు మొదలవుతాయని నిపుణులు చెబుతున్నారు.ధూమపానం మానేయడం వల్ల గుండె జబ్బులు, క్యాన్సర్, జుూణ వంటి ధూమపాన సంబంధిత వ్యాధుల ప్రమాదం కూడా తగ్గుతుందని జణజ పేర్కొంది.ఎప్పుడైనా తగ్గని దగ్గు, నోటిపూత లేదా విపరీతమైన అలసట వంటి సమస్యలు వేధిస్తుంటే, భవిష్యత్తులో వచ్చే పెద్ద పెద్ద ఆరోగ్య ముప్పులను నివారించడానికి వీలైనంత త్వరగా డాక్టర్‌ను సంప్రదించాలని నిపుణులు చెబుతున్నారు.ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. కానీ, వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# మీ శరీరానికి రోజూ సరిపడా ప్రొటీన్ ఇస్తున్నారా ఎవరెవరికి, ఎంత అవసరం

**నిశ్శబ్ద పోషకాహార సంక్షోభం దేశంలో 70-80 శాతం మందిలో ప్రొటీన్ లోపం**



శరీర నిర్మాణంలో ప్రొటీన్ పాత్ర కీలకం. దేహంలోని కణాలన్నింటికీ అవసరం. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రొటీన్ శరీరానికి చోదక శక్తి లాంటిది. అయితే, ప్రొటీన్ లోపంతో బాధపడేవారి సంఖ్య దేశంలో ఎక్కువవుతోందని పలు నివేదికలు హెచ్చరిస్తున్నాయి. రోజువారీ ఆహారంలో ఎంత ప్రొటీన్ తీసుకోవాలి, ఏయే పదార్థాల్లో లభిస్తుందనే విషయం చాలామందికి తెలియడం లేదంటున్నాయి.దేశవ్యాప్తంగా 70-80 శాతం ప్రజల్లో ఈ లోపం ఉండగా, శాకాహారుల్లో మరింత ఎక్కువగా ఉందని గుర్తించారు. దీన్ని 'నిశ్శబ్ద పోషకాహార సంక్షోభం'గా పేర్కొంటూ, ఆహారంలో కార్బోహైడ్రేట్లకే అధిక ప్రాధాన్యతనివ్వడం, ఆధునిక జీవనశైలి, జంక్‌ఫుడ్స్, మైదాతో చేసిన తినుబండరాలు తినడమే ఈ సమస్యకు ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు.

### నివేదికలు ఏం చెబుతున్నాయి :

దేశంలో ప్రొటీన్ లోపంపై ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్, ఇండియన్ మార్కెట్ రీసెర్చ్ బ్యూరో తదితర సంస్థలు ఆసక్తికర విషయాలు వెల్లడించాయి.ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ ప్రకారం ప్రతి కిలో శరీర బరువుకు రోజుకి ఒక గ్రాము ప్రొటీన్ తీసుకోవాలి. సగటు భారతీయులు తీసుకునేది 0.8 గ్రాములే.ప్రపంచ జనాభాలో సగటున ఓ వ్యక్తి రోజుకి 68 గ్రాముల ప్రొటీన్ తీసుకుంటుండగా, భారత్‌లో అది కేవలం 47 గ్రాములుగా ఉంది.ఇండియన్ డైటెటిక్ అసోసియేషన్ ప్రకారం, 84 శాతం శాకాహారులు, 65 శాతం మాంసాహారులు ప్రొటీన్ లోపంతో బాధపడుతున్నారు.పట్టణ ప్రాంతాల్లో 70-80 శాతం మంది రోజువారీ ఆహారంలో కావలసినంత ప్రొటీన్ తీసుకోవడం లేదు.ప్రతి 10 మంది భారతీయుల్లో ఏడుగురు ప్రొటీన్ లోపంతో బాధపడుతున్నారు.73 శాతం యువత అవసరమైన దానికంటే తక్కువ ప్రొటీన్ తీసుకుంటున్నారు.మహిళలు ప్రత్యేకించి గృహిణుల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంటోంది.

### ఎవరెవరికి, ఎంతంటే :

వయసు, లింగం, బరువు, చేసే పనుల ఆధారంగా రోజుకు ఎంత ప్రొటీన్ అవసరమనేది ఆధారపడి ఉంటుంది.నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ మార్గదర్శకాల ప్రకారం 1 నుంచి మూడేళ్లున్న పిల్లల్లో బరువు ఆధారంగా కిలోకు 1.05 - 1.2 గ్రా ప్రొటీన్ అవసరం. 3 ఏళ్ల పిల్లల సాధారణ బరువు 14 కిలోలుంటే రోజుకు 14.7 నుంచి 16.8 గ్రా. ప్రొటీన్ ఇవ్వాలి. 4-8 ఏళ్లు (19 గ్రా), 9-13 ఏళ్లు (34 గ్రా), 14-18 వయసున్న అబ్బాయిలకు (52 గ్రా.), అమ్మాయిలకు (46 గ్రా.), 19-50 వయసున్న పురుషులకు (56 గ్రా.), మహిళలకు (46 గ్రా.), 50 ఏళ్లు, ఆపై ఉన్నవారికి 68-82 గ్రాములు అవసరం.శారీరక శ్రమ తక్కువగా ఉండే వారికి బరువు ఆధారంగా కిలోకు 0.8 నుంచి 1 గ్రాము ప్రొటీన్ అవసరం.రోజులో 7-8 గంటలు కూర్చొని పనిచేసే వారికి (సుమారు 60 కిలోలు) రోజుకు 48-60 గ్రాములు, ఒక వ్యక్తి (సుమారు 60 కిలోలు) రోజుకి కనీసం గంట వ్యాయామం, నడక, నిల్చొని పనిచేయడం, బరువులు ఎత్తడం చేస్తే 60-72 గ్రాములు. అయితే, గర్భిణులు, బాలింతలకు రోజుకి అదనంగా 10-15 గ్రాములు అవసరం.

### తీసుకోవాల్సినవి :

ప్రొటీన్లు రెండు రకాలు. యానిమల్ బేస్డ్, ప్లాంట్ బేస్డ్. మాంసాహారులు వారానికి 3 రోజులు యానిమల్ బేస్డ్, 3 రోజులు ప్లాంట్ బేస్డ్ ప్రొటీన్‌ను మార్చి మార్చి తీసుకోవాలి.గుడ్లు, పాలు, పెరుగు, చేపలు, చీజ్, మాంసం తదితర ఉత్పత్తులు నాణ్యమైన ప్రొటీన్ వనరులు.పప్పుధాన్యాలు, బాదం, వేరుశనగ, క్వినోవా, తృణధాన్యాలు, సోయా, జీడిపప్పు, వాల్‌నట్స్, గుమ్మడి, పొద్దుతిరుగుడు గింజలు, నువ్వులు, అవిసె గింజలు, డెయిరీ ఉత్పత్తులుకొన్ని రకాల కూరగాయలు, పండ్లలోనూ ప్రొటీన్ లభిస్తుంది.జీర్ణాశయ సమస్యలున్నవారు అవి తగ్గేంత వరకు పప్పులు, ధాన్యాలు తీసుకోకపోవడం మంచిది.

### పరిశోధన మూలాలు :

ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. కానీ, వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# 'స్నికర్స్' పేరుకు ఓ గుర్రంతో లింక్.. చాక్లెట్ పేరు వెనుక ఆసక్తికర కథ

**స్నికర్స్ చాక్లెట్ పేరుకు ఓ గుర్రంతో ఆసక్తికరమైన సంబంధం**

**మార్స్ కుటుంబం పెంచిన రేసు గుర్రం పేరు 'స్నికర్స్'**

**రేసుల్లో విజేతగా నిలిచిన గుర్రం**

**చాక్లెట్ విడుదలకు నెల రోజుల ముందే చనిపోయిన గుర్రం**

**దాని జ్ఞాపకార్థం చాక్లెట్‌కు 'స్నికర్స్' పేరు**




ప్రపంచవ్యాప్తంగా ఎంతో ప్రాచుర్యం పొందిన చాక్లెట్ బార్ స్నికర్స్ పేరుకు ఓ గుర్రంతో సంబంధం ఉంది. స్నికర్స్ తయారీ సంస్థ మార్స్ తెలిపిన వివరాల ప్రకారం.. తొలి స్నికర్స్ బార్‌ను 1930లో అమెరికాలోని షికాగోలో తయారు చేశారు. కంపెనీ వ్యవస్థాపక కుటుంబానికి చెందిన గుర్రం పేరును ఈ చాక్లెట్‌కు పెట్టారు.మార్స్ కుటుంబం చాక్లెట్ వ్యాపారంలో విజయవంతమైన తర్వాత 3,000 ఎకరాల గుర్రాల పెంపకం ఫారాన్ని కొనుగోలు చేసింది. ఆ ఫారంలో పెంచిన రేసు గుర్రాల్లో స్నికర్స్ కూడా ఒకటి. అది రేసుల్లో విజేతగా నిలిచింది. అయితే కొత్త చాక్లెట్ బార్‌ను మార్కెట్లోకి తీసుకురావడానికి నెల రోజుల ముందే ఆ గుర్రం చనిపోయింది. దీంతో దాని జ్ఞాపకార్థం చాక్లెట్‌కు 'స్నికర్స్' అని పేరు పెట్టారు.మిల్క్ చాక్లెట్, కారమెల్, నౌగట్, వేరుశనగల కలయికతో రూపొందించిన ఈ బార్‌ను తొలిసారి కేవలం ఐదు సెంట్లకు విక్రయించారు. అనంతరం ఇది ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది.అయితే బ్రిటన్‌లో మాత్రం తొలుత 'స్నికర్స్' పేరుతో కాకుండా 'మారథాన్ బార్' పేరుతో విక్రయించారు. 'స్నికర్స్' అనే పేరు అక్కడి 'నికర్స్' అనే పదానికి దగ్గరగా ఉండటంతో వివాదం తలెత్తవచ్చని భావించి ఈ మార్పు చేశారు. కొంతకాలం తర్వాత మళ్లీ అసలు పేరైన స్నికర్స్‌నే కొనసాగిం చా రు.కాలక్రమంలో స్నికర్స్ ఫన్ సైజ్, ఐస్‌క్రీమ్ బార్, ఆల్మండ్, పీనట్ బటర్, పెకాన్ తదితర అనేక వేరియంట్లను తీసుకొచ్చింది. 2010లో "యూ ఆర్ నాట్ యూ వెన్ యూ ఆర్ హంగ్రీ" అనే ప్రకటనల ప్రచారం తర్వాత బ్రాండ్‌కు మరింత ప్రపంచవ్యాప్త గుర్తింపు వచ్చింది.


# 'పరగడుపు అలవాట్లు' వీటితో ఎంతో ప్రమాదం ఉందంటున్న నిపుణులు

**ఉదయాన్నే వీటిని దూరం పెట్టండి ఖాళీ పొట్టతో తింటే జీర్ణ సమస్యలు**



ఉదయాన్నే నిద్ర లేవగానే మన జీర్ణవ్యవస్థ ఒక ఖాళీ స్పాంజ్ లాంటి స్థితిలో ఉంటుంది. రాత్రంతా ఉపవాసం తర్వాత, పరగడుపున మనం తీసుకునే మొదటి ఆహారాన్ని కడుపు చాలా వేగంగా గ్రహిస్తుంది. అందుకే, ఈ సమయంలో శరీరానికి అమృతం లాంటి పోషకాలు అందించాలి. అలాకాకుండా, కొన్ని రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల కొన్ని రకాల ఆరోగ్య సమస్యలు వస్తాయంటున్నారు.ఖాళీ కడుపుతో ఉన్నప్పుడు జీర్ణాశయంలో యాసిడ్ల ఉత్పత్తి సహజంగానే ఎక్కువగా ఉంటుంది. ఆ సమయంలో తప్పుడు ఆహారాలు లేదా పానీయాలు తీసుకోవడం వల్ల జీర్ణక్రియ మందగించడమే కాకుండా, కడుపులో మంట, అల్సర్లు, తీవ్రమైన గ్యాస్ సమస్యలు, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో పరగడుపున ఎలాంటి ఆహార పదార్థాలు తీసుకోవద్దో ఇప్పుడు తెలుసుకుందాం.ఉప్పు, కారం, మసాలాలు ఖాళీ కడుపుతో ఉన్నప్పుడు జీర్ణాశయంలో ఆహారం ఏదీ ఉండదు. దీనివల్ల మనం తినే కారం, మసాలాలు నేరుగా కడుపు లోపలి సున్నితమైన పొరను తాకి తీవ్రమైన చికాకును, మంటను కలిగిస్తాయి.సిట్రస్ పండ్లు : పండ్లు ఆరోగ్యానికి మంచిదే. కానీ, సిట్రస్ ఫ్రూట్స్ అయిన నిమ్మ, నారింజ వంటి వాటిని పరగడుపున తీసుకుంటే గ్యాస్ సమస్య వస్తుంది. ఎందుకంటే, సిట్రస్ జాతి పండ్లలో సిట్రిక్ యాసిడ్ పరిమాణం సహజంగానే ఎక్కువగా ఉంటుంది. సాధారణంగా ఖాళీ కడుపుతో ఉన్నప్పుడు మన జీర్ణాశయంలో హైడ్రోక్లోరిక్ ఆమ్లం విడుదలవుతుంది. ఆ సమయంలో ఈ పండ్లను తీసుకోవడం వల్ల పొట్టలో యాసిడ్ స్థాయిలు మరింత పెరిగిపోతాయి. ఫలితంగా, గ్యాస్, కడుపు ఉబ్బరం, గుండెల్లో మంట వంటి జీర్ణక్రియ సమస్యలు తలెత్తుతాయి.కాఫీ, టీలు ఉదయం లేవగానే కాఫీ తాగే అలవాటు చాలామందికి ఉంటుంది. కానీ, ఏం తినకుండా ఇవి తీసుకుంటే ఎసిడిటీ ఇబ్బంది పెడుతుంది. పాలు, పంచదార వేసిన కాఫీ లేదా టీలను పరగడుపున తాగినప్పుడు, పాలలో ఉండే లాక్టోజ్, చక్కెర సులభంగా జీర్ణం కావు. ఇది పొట్టలో గ్యాస్ తయారవడానికి, కడుపు ఉబ్బరానికి కారణమవుతుంది.ఉదయాన్నే ఖాళీ కడుపుతో శీతల పానీయాలు తీసుకోకూడదు. వీటిలో ఉండే కార్బోనేటెడ్ పొట్ట ఉబ్బరాన్ని కలిగిస్తుంది.పరగడుపున తీపి పదార్థాలు తీసుకుంటే శరీరంలో ఇన్సులిన్ స్థాయిలు వేగంగా పెంచుతాయి. జీర్ణాశయంలోని ఎంజైములు బద్ధకంగా మారతాయి.నూనెలో డీప్ ఫ్రై చేసిన ఆహారాన్ని ఉదయాన్నే తీసుకోకూడదు. దీని వల్ల నీళ్లను ఎక్కువగా తాగడంతో పాటు పొట్ట ఉబ్బరం, అజీర్తి ఇబ్బంది పెడతాయి.పచ్చళ్లలో ఉప్పు, కారం, నూనె ఎక్కువగా ఉంటాయి. ఇవి గ్యాస్, అజీర్తిని కలిగిస్తాయి. కాబట్టి, టిఫిన్‌తో పాటు నిల్వ పచ్చళ్లు తీసుకోకపోవడమే ఉత్తమం.ఛీజ్‌లో కొవ్వు ఎక్కువగా ఉంటుంది. అందులోనూ హార్డ్ ఛీజ్, ఫ్యాట్ అధికంగా ఉండే పాల పదార్థాలను పరగడుపున తీసుకోవడం వల్ల అజీర్తి సమస్య ఏర్పడుతుంది.ఐస్‌క్రీమ్‌ని ఖాళీ కడుపుతో తీసుకుంటే జీర్ణ వ్యవస్థకు ఇబ్బంది కలిగిస్తుంది. ఫ్యాట్‌తో పాటు చక్కెర శాతం ఎక్కువగా ఉంటుంది. వికారంతో పాటు అజీర్తి సమస్యలు వస్తాయిదానిమ్మ గింజలు ఆరోగ్యానికి మంచిదే. కానీ, పరగడుపున వీటిని తీసుకోకూడదు. వీటిల్లో ఉండే యాసిడ్ జీర్ణవ్యవస్థకు చిరాకుని కలగించడమే కాకుండా గుండెల్లో మంటగా అనిపిస్తుంది.

# ఆస్టియోపోరోసిస్, గౌట్.. రెండూ ఒకటే అనుకుంటున్నారా తేడా ఇదే




ఆధునిక జీవనశైలిలో అనేకమందిని వేధిస్తున్న ఆరోగ్య సమస్యల్లో ఎముకలు, కీళ్లకు సంబంధించినవి ప్రధానమైనవి. అయితే, చాలామంది ఆస్టియోపోరోసిస్ (ఎముకల బలహీనత), గౌట్ (కీళ్లవాతం) రెండూ ఒకటేనని అపోహ పడుతుంటారు. వాస్తవానికి ఈ రెండు సమస్యల మధ్య చాలా తేడా ఉంది. వాటి కారణాలు, లక్షణాలు, చికిత్సా విధానాలు పూర్తిగా భిన్నం. ఈ రెండింటిపై సరైన అవగాహన కలిగి ఉండటం ఆరోగ్యానికి ఎంతో ముఖ్యం.

### ఆస్టియోపోరోసిస్ అంటే ఏమిటి

ఆస్టియోపోరోసిస్ అంటే ఎముకలు గుల్లబారి, వాటి సాంద్రత తగ్గి, పెళుసుగా మారే పరిస్థితి. దీనివల్ల ఎముకలు సులభంగా విరిగిపోయే (ఫ్రాక్చర్) ప్రమాదం పెరుగుతుంది. ముఖ్యంగా వయసు పైబడిన వారిలో, మహిళల్లో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. కాల్షియం, విటమిన్ డి లోపం, వ్యాయామం లేకపోవడం, ధూమపానం, అధిక మద్యపానం వంటివి ఈ సమస్యకు దారితీస్తాయి. ఈ సమస్యను నిర్ధారించడానికి వైద్యులు డెక్సా స్కాన్ లేదా బీఎండీ పరీక్షను సూచిస్తారు. దీని ద్వారా ఎముకల సాంద్రతను కచ్చితంగా అంచనా వేయవచ్చు.

### గౌట్ ఎందుకు వస్తుంది


మరోవైపు, గౌట్ అనేది జీవక్రియకు సంబంధించిన సమస్య. రక్తంలో యూరిక్ యాసిడ్ స్థాయిలు పెరిగినప్పుడు, అది సూది వంటి స్ఫటికాలుగా మారి కీళ్లలో పేరుకుపోతుంది. దీనివల్ల కీళ్లలో అకస్మాత్తుగా తీవ్రమైన నొప్పి, వాపు, ఎరుపెక్కిన చర్మం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ముఖ్యంగా కాలి బొటనవేలు కీలులో ఈ నొప్పి ఎక్కువగా ఉంటుంది. అధికంగా మాంసం (రెడ్ మీట్), కొన్నిరకాల సముద్రపు ఆహారాలు, చక్కెర పానీయాలు, మద్యం సేవించడం వల్ల యూరిక్ యాసిడ్ పెరిగే ప్రమాదం ఉంది. సీరమ్ యూరిక్ యాసిడ్ రక్త పరీక్ష ద్వారా ఈ సమస్యను నిర్ధారిస్తారు. అవసరమైతే కిడ్నీ పనితీరును అంచనా వేసే పరీక్షలు కూడా చేస్తారు.

### ఆహారం, జీవనశైలి పాత్ర

ఆస్టియోపోరోసిస్ నివారణకు పాలు, పెరుగు, ఆకుకూరలు, చేపలు వంటి కాల్షియం అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలి. బరువులు మోసే వ్యాయామాలు, నడక ఎముకల బలాన్ని పెంచుతాయి. గౌట్ సమస్య ఉన్నవారు నీరు ఎక్కువగా తాగాలి. ప్యూరిన్లు అధికంగా ఉండే మాంసాహారం, మద్యం వంటి వాటికి దూరంగా ఉండాలి. పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు ఎక్కువగా తీసుకోవడం మంచిది.అయితే, ఆహార నియమాలు పాటించడం మాత్రమే చికిత్స కాదని గుర్తుంచుకోవాలి. లక్షణాలను బట్టి సొంతంగా ఓ నిర్ధారణకు రావడం ప్రమాదకరం. సమస్యను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే నిపుణులైన వైద్యులను సంప్రదించి, సరైన పరీక్షలు చేయించుకుని, వారి సూచనల మేరకు చికిత్స తీసుకోవడం అత్యవసరం. సరైన అవగాహన, సకాలంలో చికిత్సతో ఈ రెండు సమస్యలనూ సమర్థంగా ఎదుర్కోవచ్చు.

# డిజిటల్ సంతకాలు అంటే ఏంటి ఇవి ఆన్‌లైన్ మోసాలను ఎలా నివారిస్తాయి

## ఆన్‌లైన్ లావాదేవీల్లో మోసాలను నివారించడానికి డిజిటల్ సంతకాలు ఒక శక్తివంతమైన సాధనంగా చెబుతోన్న నిపుణులు



డిజిటల్ టెక్నాలజీ వేగంగా అభివృద్ధి చెందడంతో, ఆన్‌లైన్ లావాదేవీలు మన రోజువారీ జీవితంలో ఒక అంతర్భాగంగా మారాయి. ఆన్‌లైన్‌లో షాపింగ్ చేయడం, నిధులను బదిలీ చేయడం లేదా వ్యాపారం చేయడం వంటి ఏ విషయంలోనైనా సరే.. డిజిటల్ ట్రాన్సాక్షన్స్ విప్లవాత్మక పాత్ర పోషిస్తున్నాయి. అయితే, ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్ల వల్ల ఎన్ని లాభాలు ఉన్నాయో అదే రీతిలో మోసాలు కూడా జరుగుతున్నాయి. ఈ మోసాలను నివారించడానికి డిజిటల్ సంతకాలు ఒక శక్తివంతమైన సాధనంగా ఆవిర్భవించాయని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్స్‌లో మోసాలను నివారించడానికి ఇవి ఎలా దోహదపడుతున్నాయో ఈ స్టోరీలో చూద్దాం. డిజిటల్ సంతకం అంటే : డిజిటల్ సిగ్నేచర్ అనేది ఒక డిజిటల్ పత్రం లేదా సందేశానికి సంబంధించిన సమగ్రతను, ప్రామాణికతను ధ్రువీకరించడానికి ఉపయోగించే ఒక క్రిప్టోగ్రాఫిక్ పద్ధతి అని నిపుణులు చెబుతున్నారు. ఒక వ్యక్తికి సంబంధించిన గుర్తింపును చేతితో రాసి తెలిపే సంప్రదాయ సంతకానికి భిన్నంగా, క్రిప్టోగ్రాఫిక్ కీలను ఉపయోగించి రూపొందించిన ఒక గణిత అల్గారిథమే డిజిటల్ సంతకం అని వివరిస్తున్నారు. సంతకం చేసే వ్యక్తికి సంబంధించిన ప్రైవేట్ కీతోపాటు, సంతకం చేస్తున్న పత్రం లేదా సందేశంలోని విషయానికి ఒక గణిత ఫంక్షన్‌ను వర్తింపజేయడం ద్వారా డిజిటల్ సంతకాలు సృష్టిస్తారని పేర్కొంటున్నారు. ఇక ఐటీఆర్ దాఖలు చేయడానికి, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు సమర్పణలు చేయడానికి లేదా ఇ-టెండర్లలో పాల్గొనడానికి, అద్దె ఒప్పందాలు, ఉద్యోగ ఒప్పందాలు వంటి వ్యక్తిగత చట్టపరమైన పత్రాల కోసం డిజిటల్ సంతకాలను ఉపయోగించవచ్చని చెబుతున్నారు. పూర్తిగా ఎలక్ట్రానిక్ రూపంలో రూపొందించి, ప్రాసెస్ చేసిన పత్రాలకు ఇ-సంతకాలు ఉత్తమంగా సరిపోతాయని, ఇవి వేగం, భద్రత, చట్టపరమైన చెల్లుబాటును నిర్ధారిస్తాయంటున్నారు. ఎక్కడ చెల్లవు: వీలునామాలు, రిజిస్ట్రేషన్, భౌతిక సంతకాలు అవసరమయ్యే సేల్ డీడ్, గిఫ్ట్ డీడ్ వంటి కొన్ని ఆస్తి పత్రాలు, పవర్ ఆఫ్ అటార్నీ, ట్రస్ట్ డీడ్‌లు లాంటి వాటిలో డిజిటల్ సంతకాలను అంగీకరించరని నిపుణులు చెబుతున్నారు. కోర్టులు కేవలం క్రిప్టోగ్రాఫిక్ రుజువుపై కాకుండా, మానవ సాక్ష్యం భౌతిక ధ్రువీకరణపై ఆధారపడతాయంటున్నారు. అందుకే, డిజిటల్ సంతకాలకు భద్రత ఉన్నప్పటికీ, అవి వీలునామా పత్రాలకు సరిపోవని చెబుతున్నారు. డిజిటల్ సంతకాన్ని ఎలా పొందాలి: కంట్రోలర్ ఆఫ్ సర్టిఫైయింగ్ అథారిటీస్ ద్వారా నియంత్రించబడే లైసెన్స్ పొందిన సర్టిఫైయింగ్ అథారిటీ నుంచి డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికేట్ పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఇ-ముద్ర, ప్రోటీన్, జఖూరా వెంచర్స్, జూజతో సహా సుమారు 23 సర్టిఫికేషన్ అథారిటీలు వీటిని అందిస్తాయంటున్నారు. పాన్, ఆధార్, ఖీజ వివరాలను సమర్పించి, ధ్రువీకరణ ప్రక్రియను (వీడియో లేదా భౌతిక) పూర్తి చేయాల్సి ఉంటుందంటున్నారు. పూర్తి వెరిఫికేషన్ తర్వాత మంజూరు అయ్యే ఖూజ సర్టిఫికెట్ ఒకటి నుంచి మూడు సంవత్సరాల వరకు చెల్లుబాటులో ఉంటుందని వివరిస్తున్నారు. తరగతి, చెల్లుబాటును బట్టి దీని ధర రూ. 1,000 నుంచి రూ. 3,000 మధ్య ఉంటుందని చెబుతున్నారు. ఇక ఈ సంతకాన్ని ఖూదీ టోకెన్ వంటి హార్డ్‌వేర్ పరికరంలో సురక్షితంగా ఉంచుతారని, దీనివల్ల ఆ వ్యక్తి మాత్రమే దాన్ని ఉపయోగించడానికి వీలుంటుందని సూచిస్తున్నారు. అధిక భద్రత డిజిటల్ సంతకానికి, సంప్రదాయ సంతకానికి మధ్య ఒక ముఖ్యమైన వ్యత్యాసం ఉందంటున్నారు నిపుణులు. అదేంటంటే డిజిటల్ సంతకం, క్రిప్టోగ్రాఫిక్ సూత్రాలపై ఆధారపడి ఉంటుందని, దీనివల్ల దాన్ని డూప్లికేట్ చేయడం లేదా తారుమారు చేయడం చాలా కష్టమంటున్నారు. సులభంగా నకలు చేయగల లేదా తారుమారు చేయగల చేతితో రాసిన సంతకాలతో పోలిస్తే ఇది అధిక స్థాయి భద్రతను, నమ్మకాన్ని అందిస్తుందని వివరిస్తున్నారు. డిజిటల్ సంతకానికి సంబంధించిన ముఖ్య భాగాలలో క్రిప్టోగ్రాఫిక్ అల్గారిథం, పబ్లిక్-కీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అని పిలిచే అంతర్లీన మౌలిక సదుపాయాలు ఉంటాయని, డిజిటల్ సంతకాలు సంతకం చేసేవారి గుర్తింపును ప్రామాణీకరించడానికి ఒక పటిష్టమైన మార్గాన్ని అందిస్తాయంటున్నారు. క్రిప్టోగ్రాఫిక్ కీలను ఉపయోగించడం వల్ల ఇది ప్రత్యేకంగా సంతకం చేసేవారికి మాత్రమే కేటాయిస్తారని, దాన్ని నకిలీ చేయడం వీలుకాదంటున్నారు. ఈ అథెంటికేషన్ ప్రక్రియ.. ఖాతాలకు అనధికారిక ప్రాప్యతను నిరోధించడంలో సహాయపడి గుర్తింపు చోరీ నుంచి రక్షిస్తుందంటున్నారు. డిజిటల్ సంతకాలు లావాదేవీ డేటాకి సంబంధించిన వివరాలను నిర్ధారిస్తాయని, డిజిటల్ సంతకం చేసిన తర్వాత సంతకం చేసిన పత్రం లేదా సందేశంలో ఏదైనా మార్పు చేస్తే, ధ్రువీకరణ సమయంలో ఆ సంతకం చెల్లదంటున్నారు. ఈ ట్యాంపర్-ప్రూఫ్ ఫీచర్ అనధికారిక మార్పుల నుంచి కాపాడి, లావాదేవీకి సంబంధించిన సమగ్రతను నిర్ధారిస్తుందంటున్నారు. మోసాల నివారణ: క్రిప్టోగ్రాఫిక్ అల్గారిథమ్ డిజిటల్ సంతకాల ద్వారా డిజిటల్ పత్రాల సమగ్రతను, అథెంటికేషన్‌ను ధ్రువీకరించి, ఉన్నత స్థాయి భద్రతను అందిస్తాయని, ఇది సంతకం చేసేవారి గుర్తింపు ధ్రువీకరణ జరిగిందని, పత్రం తారుమారు అవ్వలేదని నిర్ధారిస్తుందంటున్నారు. అధీకృత వ్యక్తులు మాత్రమే పత్రాలపై సంతకం చేయగలరని, వాటిని యాక్సెస్ చేయగలరని నిర్ధారణ అవుతుందని, తద్వారా మోసపూరిత లావాదేవీలకు సంబంధించిన ప్రమాదాలు కూడా ఉండవంటున్నారు. డిజిటల్ సంతకాలతో పాటు ఒక సమగ్ర డిజిటల్ ఆడిట్ ట్రెయిల్ కూడా ఉంటుందని, ఇది సంతకం చేసిన సమయం, సంతకం చేసేవారి గుర్తింపు ధ్రువీకరణ, సంతకం ప్రక్రియలోని ప్రతి దశ వంటి వివరణాత్మక ఈవెంట్ సమాచారాన్ని సంగ్రహిస్తుందంటున్నారు. ఇది మెరుగైన ట్రాకింగ్, పర్యవేక్షణకు వీలు కల్పిస్తుందని, దీని ద్వారా ఏవైనా అనుమానాస్పద లేదా మోసపూరిత కార్యకలాపాలను గుర్తించడం సులభం అవుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

# సుభాష్ చంద్ర రూ. 22 వేల కోట్ల అప్పు నిజంగానే మాఫీ అయ్యిందా

## మొత్తం రూ. 6.5 కోట్లకు ఎందుకు తగ్గింది



జీ గ్రూప్ వ్యవస్థాపకుడు సుభాష్ చంద్ర వ్యక్తిగత దివాలా వ్యవహారంలో జాతీయ కంపెనీ చట్టాల ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి) ఢిల్లీ బెంచ్ ఇచ్చిన ఆమోదం ప్రస్తుతం దేశీయ ఆర్థిక, కార్పొరేట్ వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. ఆయనపై నమోదు చేసిన రూ. 22,006 కోట్ల మొత్తం క్లెయిమ్‌లను కేవలం రూ. 6.25 కోట్లు చెల్లించి పరిష్కరించుకోవడానికి ఎన్‌సిఎల్‌టి అనుమతించడం బ్యాంకింగ్ రంగంలో పెద్ద చర్చకు దారితీసింది. ఈ నిర్ణయంపై ఒకవైపు ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ వంటి ప్రధాన రుణదాతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తుండగా.. మరోవైపు ప్రచారంలో ఉన్న '99.97 శాతం మాఫీ' అంకె కేవలం తప్పుదోవ పట్టించే అంశమేనంటూ ప్రభుత్వ వర్గాలు వివరణ ఇస్తున్నాయి. ఈ సంక్లిష్టమైన కేసును పరిశీలిస్తే.. ట్రిబ్యునల్‌లో ఇద్దరు సభ్యుల బెంచ్ భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తం చేయడంతో వ్యవహారం మూడవ న్యాయ సభ్యుడైన నిలేష్ శర్మ వద్దకు చేరింది. ఆయన ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ కోడ్ (ఐబిసి) సెక్షన్ 114 కింద ఈ పరిష్కార ప్రణాళికకు ఆమోదం తెలిపారు. ట్రిబ్యునల్ వ్యాఖ్యానించిన దాని ప్రకారం.. చంద్ర వద్ద ఉన్న వ్యక్తిగత ఆస్తుల విలువ ప్రతిపాదించిన మొత్తానికంటే చాలా తక్కువగా ఉందని, ఆయనను పూర్తిగా దివాలా ప్రక్రియలోకి నెట్టడం వల్ల వ్యతిరేకిస్తున్న బ్యాంకులకు ఒరిగేదేమీ ఉండదని పేర్కొంది. మొత్తం 80.8 శాతం ఓటింగ్ వాటా కలిగిన రుణదాతలు ఈ ప్రణాళికకు మద్దతు తెలపగా.. ప్రధాన బ్యాంకులు మాత్రం దీనిని వ్యతిరేకించాయి. ఈ ప్రతిపాదన కింద చంద్ర వ్యక్తిగత హామీదారుగా రూ. 6.25 కోట్లు చెల్లించనుండగా, రుణాలను అసలుగా వినియోగించుకున్న ప్రధాన కంపెనీలు విడిగా రూ. 1,494 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. అయితే, బ్యాంకులు ఏకంగా రూ. 22,000 కోట్ల రుణాన్ని మాఫీ చేశాయనే కోణాన్ని ప్రభుత్వ వర్గాలు గట్టిగా ఖండిస్తున్నాయి. ఈ రూ. 22,006 కోట్ల నంబర్.. సుభాష్ చంద్ర వ్యక్తిగతంగా తీసుకున్న రుణం కాదని వారు స్పష్టం చేస్తున్నారు. ఇందులో కేవలం రూ. 2,574 కోట్లు మాత్రమే మొదట్లో ఆయన అందించిన వ్యక్తిగత పూచీకత్తులకు వర్తిస్తాయి. కార్పొరేట్ రుణగ్రహీతలు తమ అప్పులకు పూర్తిగా బాధ్యత వహించాల్సిందేనని.. చంద్ర వ్యక్తిగత పరిష్కారంతో సంబంధం లేకుండా ఆ మూల కంపెనీల నుండి బకాయిలు, వాటి సెక్యూరిటీలు, అందుబాటులో ఉన్న ఆస్తులను వసూలు చేసుకునే హక్కు రుణదాతలకు కొనసాగుతుందని వివరించారు. స్టాక్ మార్కెట్ దెబ్బేసిందా.. షేర్లు అమ్ముకుని ఎగ్జిట్ అవుతున్న ఇన్వెస్టర్లు.. కారణమేమిటంటే.. దీనికి భిన్నంగా, రుణదాతలైన ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకులు ఈ ప్రతిపాదనను ఆచరణ సాధ్యం కానిదిగా, చట్టవిరుద్ధమైనదిగా అభివర్ణిస్తున్నాయి. గతంలో చంద్ర చూపించిన నికర ఆస్తి విలువ వేల కోట్లలో ఉండగా, ఇప్పుడు సడన్‌గా అది కేవలం సుమారు రూ. 31.79 కోట్లకు పడిపోవడం వెనుక ఉన్న కారణాలపై లోతైన విచారణ జరగాలని బ్యాంకులు కోరుతున్నాయి. ఈ నేపథ్యంలో వారు నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌ఏటి)లో ఎన్‌సిఎల్‌టి తీర్పును సవాలు చేయడానికి సిద్ధమవుతున్నారు. మరోవైపు సుభాష్ చంద్ర మాత్రం తాను ఏ బ్యాంకు వద్ద నుంచి వ్యక్తిగతంగా రుణాలు తీసుకోలేదని, తన కంపెనీలు ఇప్పటికే రూ. 43,000 కోట్లను రుణదాతలకు తిరిగి చెల్లించాయని.. మిగిలిన బకాయిలను కూడా ఆ సంస్థలే చెల్లిస్తాయని స్పష్టం చేశారు. ఈ ఉదంతం భారతీయ దివాలా ప్రక్రియ (ఐబిసి) వ్యవస్థ వైఫల్యం కిందకు రాదని.. ఇది కేవలం ఒక ప్రత్యేకమైన వ్యక్తిగత-హామీదారు పరిష్కార కేసని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. మొత్తంమీద ఎన్‌సిఎల్‌టి అసలు డివిజన్ బెంచ్ జారీ చేయబోయే అధికారిక ఉత్తర్వులు, తదనంతరం బ్యాంకులు అప్పిలేట్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించడం ద్వారా ఈ వివాదం రాబోయే రోజుల్లో ఎలాంటి మలుపులు తిరుగుతుందో వేచి చూడాలి

# మైనింగ్‌కు ఫుల్ స్టాప్ పంచదార్ల కొండలను 'నో మైనింగ్ జోన్'గా ప్రకటించిన ఏపీ ప్రభుత్వం



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చారిత్రక, పర్యావరణ పరిరక్షణ దిశగా ఒక సంచలనాత్మక నిర్ణయం తీసుకుంది. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలంలో ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రం పంచదార్ల కొండ ప్రాంతాన్ని రాష్ట్ర ప్రభుత్వం 'నో మైనింగ్ జోన్' (మైనింగ్ నిషేధిత ప్రాంతం)గా ప్రకటిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రాంతంలో ఉన్న ఆధ్యాత్మిక, సంస్కృతిక, పురావస్తు, భూగర్భ జల, పర్యావరణ ప్రాముఖ్యతను గుర్తించి, రాబోయే తరాలకు ఈ క్షేత్రాన్ని యథాతథంగా అందించేందుకు గనుల శాఖ ఈ కీలక అడుగు వేసింది. ఈ నిర్ణయంలో భాగంగా, పంచదార్ల గ్రామంలోని సర్వే నంబర్ 1 పరిధిలో 2.153 హెక్టార్ల విస్తీర్ణంలో గతంలో మంజూరు చేసిన కంకర (గ్రావెల్) క్వారీ లీజును ప్రభుత్వం తక్షణమే రద్దు చేసింది. ఈ ఏడాది మే నెలలో దాసమనేని విజయ్ కుమార్ నాయుడు పేరిట మంజూరైన ఈ లీజు.. వాస్తవానికి 2036 మే 14 వరకు చెల్లుబాటులో ఉండేలా కేటాయించారు. అయితే, పరిమితికి మించిన తవ్వకాలు, స్థానిక భక్తుల నిరసనలు, పర్యావరణ ప్రమాదాలను పరిగణనలోకి తీసుకుని గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా ఈ లీజును రద్దు చేస్తూ కొండ పరిసరాల్లో ఇకపై ఎలాంటి మైనింగ్ అనుమతులు ఇవ్వకూడదని స్పష్టం చేశారు. ధరపాలెంలోని పంచదార్ల ఆలయం ఎంతో ప్రాచీనమైన చారిత్రక నేపథ్యాన్ని కలిగి ఉంది. క్రీస్తుశకం 1899వ సంవత్సరంలో భారత పురావస్తు శాఖ ఈ క్షేత్రంలో ఏకంగా 17 ప్రాచీన శాసనాలను నమోదు చేసింది. ఆ తర్వాత ఈ వివరాలన్నీ 'దక్షిణ భారత శాసనాలు, ఆరవ సంపుటం' లో ప్రచురితమయ్యాయి. ఈ శాసనాలు ఆనాటి తూర్పు చాళుక్యులు, స్థానిక పాలకులు, రాణులు, వారు సమర్పించిన మతపరమైన దానాలు, నిర్మాణ కార్యకలాపాల వివరాలను సమగ్రంగా వెల్లడిస్తాయి. జొన్నగిరి బంగారు గని గురించి ఎవ్వరికీ తెలియని నిజాలు.. దీని ద్వారా ఏపీకి వచ్చే ఆదాయం ఎంతంటే.. ఆలయ ప్రాంగణంలోని కొండల నుండి నిరంతరం ప్రవహించే ఐదు నీటి ధారల (ఫౌంటెన్ల) ఆధారంగా ఈ క్షేత్రానికి 'పంచధారలు' లేదా 'పంచదార్ల' అనే పేరు వచ్చింది. అక్కడ దొరికిన ఒక శాసనం ప్రకారం, ఒక రాజు ఆలయ అంతరాలమండపాన్ని నిర్మించగా.. అతని రాణి వీరమ 'వీరసాగరం' అనే పవిత్ర తటాకాన్ని నిర్మించినట్లు ఆధారాలు ఉన్నాయి. అలాగే పంచధార నది ఒడ్డున, ఆలయ దక్షిణ ప్రవేశ ద్వారం వద్ద శ్రీధర-రాజమరేంద్రమహాపాత్ర అనే పాలకుడు గంభీరమైన గోపురాన్ని నిర్మించినట్లు మరొక శాసనం ధృవీకరిస్తోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రస్తుత మైనింగ్ విధానంలో చట్టవిరుద్ధ తవ్వకాలపై కఠిన వైఖరి అవలంబిస్తున్నారు. గనుల తవ్వకాల్లో నిబంధనల ఉల్లంఘనలు జరిగినా, సహజ సిద్ధమైన నీటి వనరులకు లేదా ప్రాచీన దేవాలయాల నిర్మాణాలకు విఘాతం కలిగినా చర్యలు తప్పవని ప్రభుత్వం స్పష్టం చేసింది. రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రాచీన కట్టడాలను రక్షించుకోవడానికే మొదటి ప్రాధాన్యత అని, చట్టవిరుద్ధంగా మైనింగ్ నిర్వహిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని గనుల శాఖ తెలిపింది. పంచదర్ల ఉదంతం ద్వారా ఏపీ ప్రభుత్వం పర్యావరణ, సాంస్కృతిక వారసత్వ సంపదను కాపాడటంలో తన దృఢ సంకల్పాన్ని చాటుకుంది.

# టీసీఎస్ బోనస్ కోత ఐటీ ఉద్యోగులకు షాక్ అసలు కారణం ఇదేనా




భారత్‌లో మార్కెట్ విలువ, ఉద్యోగుల సంఖ్య పరంగా అతిపెద్ద ఐటీ సేవల సంస్థ అయిన టీసీఎస్ బోనస్‌కు సంబంధించి ఒక కీలక ప్రకటన చేసింది. ఈ నిర్ణయంతో ఉద్యోగులందరూ తీవ్ర నిరాశలో మునిగిపోయారంటే అతిశయోక్తి కాదు. టాటా గ్రూప్‌లో ఉన్నత యాజమాన్యంలో సమస్యలు కొనసాగుతున్న వేళ, ఆ సామ్రాజ్యానికే బంగారు గుడ్లు పెట్టే బాతులాంటి టీసీఎస్.. ఏఐ టెక్నాలజీ పెరుగుదల కారణంగా అనేక వ్యాపార ఒత్తిళ్లను ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలోనే లాభాలను కాపాడుకునేందుకు, ఉద్యోగులకు ఇచ్చే బోనస్‌లో కోత విధించింది. ఇండియాలోని చాలా ఐటీ కంపెనీలు బోనస్‌లను భారీగా తగ్గించడం లేదా ఆలస్యంగా ఇవ్వడం చేస్తుంటే, టీసీఎస్ మాత్రమే నిలకడగా బోనస్ ఇస్తూ వచ్చింది. కానీ ఇప్పుడు ఇతర కంపెనీల మాదిరిగానే ఆదాయ, లాభాల ఒత్తిడి టీసీఎస్‌పైనా ప్రభావం చూపడం మొదలైంది. ఉద్యోగుల ల్యాప్‌టాప్‌లలో ఏం జరుగుతోంది? కంపెనీ వివరణ 2027 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి గాను టీసీఎస్ బోనస్‌ను ప్రకటించింది. గత ఏడాది 80 శాతం వరకు బోనస్ ఇచ్చిన టీసీఎస్, ఇప్పుడు కేవలం 60-70 శాతం మాత్రమే ప్రకటించింది. కంపెనీలోని మిడ్-లెవల్ నుంచి సీనియర్-లెవల్ ఉద్యోగుల వరకు అందరికీ బోనస్ తగ్గించినట్లు సమాచారం. 'మేము 100 శాతం బోనస్ అందుకుని దాదాపు 3 సంవత్సరాలు అవుతోంది' అని చాలా మంది సీనియర్ ఉద్యోగులు వాపోతున్నారు. ఉద్యోగాలు: మీ ఉద్యోగానికి ముప్పు అసలు నిజం ఇదే అయితే, జూనియర్ స్థాయి ఉద్యోగులకు మాత్రం యథావిధిగా 100 శాతం బోనస్ ఇవ్వడం గమనార్హం. ఇదే సమయంలో, ఈ వారం ప్రారంభంలో ఇన్ఫోసిస్ కూడా తమ ఉద్యోగులకు బోనస్ ప్రకటించింది. ఇందులో జూన్ త్రైమాసికానికి సగటు బోనస్ 70 శాతంగా ఉంది. ఇది మార్చి త్రైమాసికంతో సమానమే అయినా, గత ఏడాది జూన్ త్రైమాసికంలో ఇచ్చిన 80 శాతం బోనస్‌తో పోలిస్తే ఇది దాదాపు 10 శాతం తక్కువ. ఇలా అన్ని ప్రధాన కంపెనీలు బోనస్‌లలో కోత విధించడం ఐటీ ఉద్యోగుల జీతాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. సాధారణంగా ఐటీ ఉద్యోగుల జీతంలో కొంత భాగాన్ని బోనస్‌గా చెల్లిస్తారు ఇన్ఫోసిస్ ఉద్యోగులకు షాక్: బోనస్ కోత, జీతాల పెంపుపై సస్పెన్స్ ఈ మొత్తాన్ని నాలుగు త్రైమాసికాలుగా విభజించి, ఉద్యోగి పనితీరు ఆధారంగా ప్రతి క్వార్టర్‌లో బోనస్‌గా ప్రకటిస్తారు.

# సోనల్ దినుష అద్భుతం.. ప్రత్యేకంగా అభినందించిన గౌతమ్ గంభీర్

## లంక యువ బ్యాటర్ సోనల్ దినుషపై గంభీర్ ప్రశంసలు భారత్‌తో రెండో టెస్టును ఒంటిచేత్తో డ్రా చేసిన దినుష టెస్ట్ సిరీస్‌ను 1-0 తేడాతో గెలుచుకున్న టీమిండియా



భారత జట్టు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, ప్రత్యర్థి జట్టులోని ఓ యువ ఆటగాడిపై ప్రశంసల వర్షం కురిపించాడు. శ్రీలంక యువ సంచలనం సోనల్ దినుష అసాధారణ పోరాటపటిమను ప్రత్యేకంగా అభినందిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. భారత్‌తో రెండో టెస్టును ఒంటిచేత్తో డ్రాగా ముగించిన అతడి ఆటతీరును గంభీర్ మెచ్చుకున్నాడు. ఈ సిరీస్‌ను భారత్ 1-0తో గెలుచుకున్నప్పటికీ, దినుష ప్రదర్శన అందరి దృష్టిని ఆకర్షించింది. శుక్రవారం తన 'ఎక్స్' ఖాతాలో గంభీర్ స్పందిస్తూ.. "టెస్ట్ క్రికెట్‌కు పట్టుదల, ఓపిక, మానసిక దృఢత్వం చాలా అవసరం. మన కుర్రాళ్లు దానిని ప్రదర్శించారు! అయితే, సోనల్ దినుష అసాధారణ ప్రదర్శనకు ప్రత్యేక అభినందనలు" అని పేర్కొన్నాడు. కొలంబోలోని సింహాళీస్ స్పోర్ట్స్ క్లబ్ మైదానంలో గురువారం ముగిసిన రెండో టెస్టులో, టీమిండియా విజయం అంచున నిలిచింది. అయితే, లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ సోనల్ దినుష అద్భుతమైన సెంచరీతో లంకను ఆదుకున్నాడు. ఫాలో ఆన్ ఆడుతూ కష్టాల్లో పడిన జట్టును తన అజేయమైన 133 పరుగుల (264 బంతుల్లో) ఇన్నింగ్స్‌తో గట్టెక్కించాడు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఫలితంగా భారత్ 2-0తో సిరీస్ క్లీన్‌స్వీప్ చేసే అవకాశాన్ని కోల్పోయింది. అంతకుముందు గాలెలో జరిగిన తొలి టెస్టులో భారత్ 165 పరుగుల తేడాతో గెలిచిన సంగతి తెలిసిందే. రికార్డుల మోత మోగించిన దినుష ఈ సిరీస్‌లో సోనల్ దినుష అద్భుత ఫామ్‌తో చెలరేగాడు. మొత్తం నాలుగు ఇన్నింగ్స్‌లలో ఏకంగా 420 పరుగులు సాధించాడు. ఇందులో 3 సెంచరీలు, ఒక హాఫ్ సెంచరీ (84) ఉన్నాయి. ఈ క్రమంలో పలు అరుదైన రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. ఆరో స్థానం లేదా అంతకంటే దిగువన బ్యాటింగ్‌కు వచ్చి ఒకే టెస్టులో రెండు సెంచరీలు చేసిన నాలుగో శ్రీలంక ఆటగాడిగా నిలిచాడు. అలాగే, ఒకే టెస్టులోని రెండు ఇన్నింగ్స్‌లలోనూ శతకాలు బాదిన ఎనిమిదో శ్రీలంక క్రికెటర్‌గా రికార్డు సృష్టించాడు. రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో మూడు సెంచరీలు నమోదు చేసిన మూడో లంక బ్యాటర్‌గా అరవింద డిసిల్వా, కుమార సంగక్కర సరసన చేరాడు.

# టెస్టుల్లో నా సత్తా ఏంటో చూపించా పడిక్కల్ హ్యాపీ

## టెస్టుల్లో పెద్ద స్కోర్లు చేయగలనని నిరూపించుకున్న పడిక్కల్ శ్రీలంక సిరీస్‌లో 328 పరుగులతో అదరగొట్టిన బ్యాటర్ 109.33 సగటుతో రెండు సెంచరీలు చేసిన పడిక్కల్ స్పిన్‌ను ఎదుర్కొనేందుకు ముందే ప్రత్యేకంగా సిద్ధమైనట్లు వెల్లడి శ్రీలంకలో పరిస్థితులు సవాలుగా ఉన్నాయన్న పడిక్కల్



టెస్టు క్రికెట్‌లో తాను పెద్ద స్కోర్లు చేయగలనని నిరూపించుకోవడం ఎంతో సంతృప్తినిచ్చిందని భారత బ్యాటర్ దేవ్‌దత్ పడిక్కల్ అన్నాడు. శ్రీలంకతో 1-0తో సిరీస్ గెలవడంలో తన ప్రదర్శన పట్ల సంతోషం వ్యక్తం చేశాడు. దేశవాళీ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో ఏళ్లుగా సాధించిన నిలకడే టెస్టుల్లోనూ రాణించేందుకు ఉపయోగపడిందని చెప్పాడు. సాయి సుదర్శన్ గాయపడటంతో మూడో స్థానంలో బ్యాటింగ్ చేసిన పడిక్కల్ రెండు టెస్టుల్లో 328 పరుగులు చేశాడు. 109.33 సగటుతో రెండు సెంచరీలు సాధించాడు. ఈ సిరీస్‌లో తనకు అవకాశం వస్తుందని తెలిసినప్పటి నుంచే దాని కోసం ఎదురుచూశానని తెలిపాడు. తన సత్తా ఏంటో చూపించేందుకు ఇదే సరైన అవకాశమని భావించానని చెప్పాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో పెద్ద స్కోర్లు చేసినట్లే టెస్టుల్లోనూ చేయగలిగానని ఆనందం వ్యక్తం చేశాడు. ఈ సిరీస్ ఇచ్చిన నమ్మకంతో కెరీర్‌లో ముందుకు సాగుతానని అన్నాడు. శ్రీలంకలో వేడి, ఉక్కపోత పరిస్థితులు జట్టుకు సవాలుగా నిలిచాయని పడిక్కల్ చెప్పాడు. పరిస్థితులు అంత సులభంగా లేకపోయినా మొత్తం జట్టు వంద శాతం కష్టపడిందని ప్రశంసించాడు. అందరూ ఒకే లక్ష్యంతో ఆడటం మంచి సంకేతమని పేర్కొన్నాడు. శ్రీలంక స్పిన్నర్లను ఎదుర్కోవడంపై సిరీస్‌కు ముందే ప్రత్యేకంగా సిద్ధమయ్యానని పడిక్కల్ వెల్లడించాడు. అక్కడ స్పిన్‌ను ఎదుర్కోవడం పెద్ద సవాలుగా ఉంటుందని ముందే తెలుసని చెప్పాడు. అందుకు తగ్గట్టుగా సాధన చేయడం వల్ల మంచి ఫలితం వచ్చిందని తెలిపాడు. ఇకపైనా స్పిన్‌ను ఎదుర్కొనే విషయంలో మరింత మెరుగవుతానని అన్నాడు. రెండో టెస్టులో శ్రీలంక బ్యాటర్లు అద్భుతంగా పోరాడారని పడిక్కల్ ప్రశంసించాడు. సోనల్, కేశర బ్యాటింగ్ అసాధారణంగా ఉందన్నాడు. భారత బౌలర్లు తమ శక్తిమేరకు ప్రయత్నించారని చెప్పాడు. అయితే శ్రీలంక ఆటగాళ్లు మంచి క్రికెట్ ఆడి డ్రా చేసుకున్నారని పేర్కొన్నాడు.

# కుర్రాళ్ల జోరుకు గిల్ ఫుల్ ఖుషీ.. భారత్‌కు కొత్త బలం

## శ్రీలంకపై 1-0తో సిరీస్ గెలిచిన భారత్ యువ ఆటగాళ్ల ప్రదర్శనపై గిల్ సంతోషం పడిక్కల్ రెండు సెంచరీలతో 328 పరుగులు సిరీస్‌లో మానవ్ సుతార్ కు 16 వికెట్లు గాలే టెస్టులో సుతార్‌కు పది వికెట్ల ఘనత



శ్రీలంకపై టెస్టు సిరీస్ గెలిచిన తర్వాత భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సంతోషం వ్యక్తం చేశాడు. రెండు టెస్టుల సిరీస్‌లో 1-0తో విజయం సాధించడం ఆనందంగా ఉందన్నాడు. రెండో టెస్టు డ్రాగా ముగిసినా, ఈ పర్యటనలో జట్టుకు ఎన్నో మంచి అంశాలు కనిపించాయని తెలిపాడు. ముఖ్యంగా యువ ఆటగాళ్లు దేవ్‌దత్ పడిక్కల్, మానవ్ సుతార్ రాణించడం తనను ఆకట్టుకుందని చెప్పాడు. సాయి సుదర్శన్ స్థానంలో మూడో నంబర్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన పడిక్కల్ సిరీస్‌లో అదరగొట్టాడు. రెండు సెంచరీలతో 328 పరుగులు చేశాడు. క్రీజులో నిలదొక్కుకున్న తర్వాత పెద్ద ఇన్నింగ్స్‌లు ఆడాలని బ్యాటర్లకు చెబుతుంటామని గిల్ అన్నాడు. పడిక్కల్ అదే చేసి చూపించాడని ప్రశంసించాడు. అతడి ఆట జట్టుకు మంచి సంకేతమని తెలిపాడు. ఎడమచేతి స్పిన్ ఆల్‌రౌండర్ మానవ్ సుతార్‌పైనా గిల్ ప్రశంసలు కురిపించాడు. సిరీస్‌లో 16 వికెట్లు తీసిన సుతార్ గాలే టెస్టులో పది వికెట్లతో భారత్ 165 పరుగుల విజయానికి కీలకంగా నిలిచాడు. అతడు భవిష్యత్తులో భారత స్పిన్ దాడికి చాలా కాలం నాయకత్వం వహించే ఆటగాడిగా ఎదుగుతాడని గిల్ విశ్వాసం వ్యక్తం చేశాడు. బౌలింగ్‌కు వచ్చిన ప్రతిసారీ వికెట్లు తీసే అవకాశం కల్పిస్తున్నాడని అన్నాడు. రెండో టెస్టు డ్రా కావడం మాత్రం నిరాశ కలిగించిందని గిల్ చెప్పాడు. రెండో రోజు ఆట ముగిసే సరికి గెలుస్తామని భావించామని తెలిపాడు. కానీ చివరి మూడు రోజులు శ్రీలంక అద్భుతంగా పోరాడిందని ప్రశంసించాడు. ప్రత్యర్థి ఆట నుంచి కూడా పాఠాలు నేర్చుకోవాలని అన్నాడు. ఈ సిరీస్ నుంచి మంచి అనుభవం దక్కిందని, న్యూజిలాండ్‌తో జరిగే సిరీస్‌లో మరింత మెరుగ్గా ఆడతామని గిల్ ధీమా వ్యక్తం చేశాడు.




I PRINTED, PUBLISHED & OWNED By M.SUNIL KUMAR at printed at Global printers #10 MIE Industrial Estate,Kallur,kurnool,Andhrapradesh.
Published from Hno: 4-86-1 New postal Colony,Balaji nagar,Kurnool,Andhrapradesh- 518003.EDITOR : M.sunil kumar, #1/339/17, sree ram nagar, bharpet,near nobel college ,ram-jal road Adoni kurnool district- 518301 Andhra Pradesh. E-mail: Suryaudhayamdaily@gmail.com